అనుబంధంగా...

అనసూయ

నవలిక

పుట్టిల్లు

గదిలోకి అపరాహ్నపు ఎండ తలుపులోంచి వొచ్చి పచ్చని చాపలాగు పరుచుకుంది. మెల్లిగా సూర్యుడు మంచంకోళ్ళని తాకుతున్నాడు. సరిగా మంచంకోళ్ళని తాకేప్పటికి డాక్టరొస్తాడు. ఎట్లా తెలుస్తుందో సరిగా ఆ నిమిషం! గడియారంలో చూసుకుంటాడు. గడియారానికి మాత్రం ఎట్లా తెలుస్తుందో ? తనకి కూడా అట్లాంటి గడియారం వుంటే చేతికి ? అనుకుంటోంది జబ్బుగా పడుకున్న అనసూయ. అట్లాంటి ఆలోచనలన్నా లేకపోతే అసలు యిరవైనాలుగు గంటలూ ఏమీ తోచదు. రాత్రులన్నా నిద్రరాదు. ఆమె ప్రపంచంలో ప్రస్తుతం మసులుతున్నది అమ్మా, కొత్త డాక్టరూ.

ఈ డాక్టరు వొచ్చి కదలడు. ఒకటే వాగుతాడు. ఒక్కొక్క జబ్బు మనిషి దగ్గిర అంతసేపు కూచుంటే, యింటి కెప్పుడు చేరుకుంటాడు?...... మంచివాడేనేమో ! ఆ రబ్బరుగొట్టంతో తన వీపూ, రొమ్మూ పరీక్షచేసి యేదో వింటాడు. ఆ గొట్టం జేబులోంచి తియ్యగానే తనకి చక్కలిగిలిలా గుంటుంది. రెండు చేతులతో దాన్ని నిన్న తోసేసింది. అతను నవ్వుతో 'గొట్టం పెట్టనియ్యకపోతే చెవిపెట్టి వింటా'నన్నాడు. ఒకవేళ యెప్పుడన్నా గొట్టం మరచిపోయి రాడుకద ! 'జ్వరం లేదు, యింకా లేవరాదా ?' అనేసరికి జబ్బు పోయినట్లే వుంటుంది. మంత్రం పెడతాడా యేమిటి ? యింకెంతసేపటికి వస్తాడో యీవాళ? బూడ్సులు చప్పుడు జేసుకుంటో యిజారూ - చక్కుకోటూ, టై, యెంత బావుంటాయో ! వూరికే చిరునవ్వులు నవ్వుతాడు, ఇంకా రాడేం ? జావలోకి పచ్చడి నంచుకోవచ్చేమో అడగాలని వుంది. ఇంకా ఎంతసేపు ? ఆకలవుతోంది, కొంచెం నిద్ర వొస్తోంది. తను వొచ్చేటప్పుడు అమ్మనన్నా పిలవడు. తన ఇల్లు లాగు తలుపు తోసేసుకుని సరాసరి మంచం దగ్గిరికి వొస్తాడు. ఆ పొగరుచూస్తే అనసూయకి యిష్టం.....

నిద్రపోయింది. కొంతసేపు బూడ్సుల చప్పుడు గుండెల్లో కొట్టుకుని కళ్ళు తెరిచింది. చప్పున పమిట సద్దుకుని, చీరెని కాళ్ళమీదికి లాగి, గోడవేపు తిరిగి నిద్రపోతున్నట్టు పడుకుంది. "నిద్రే" అన్నాడు. లేవకూడదు, యేం చేస్తాడో, యెట్టా లేపుతాడో చూడాలి. నిమషమయింది. వీపు వెనక చప్పుడే లేదు. ఒక నిమిషం, రెండు, మూడు ఏం చేస్తున్నాడు? ఏమయినాడు ? చూడకుండా వూరుకోవడ మెట్లా ? మెల్లిగా తిరిగి చెయ్యికిందనుంచి వొంటికన్నుతో చూసింది. మంచం పక్కనే నుంచునివున్న ప్రకాశరావు పక్కున నవ్వాడు. సిగ్గుతో అనసూయ తల వొంచుకుంది.

"యీ దొంగవేషాలు తెలీకపోతే డాక్టర్ల మెట్లా అవుతాం ? నోరు తెరు" గాజుగొట్టం నోట్లో పెడుతో వేలెందుకు బుగ్గకి తగిలించడం ? చేతికియ్యకూడదూ ! చెయ్యిజాపింది కూడాను. తనే పెడతాడు ? కింద పడేస్తుందని భయమా! వూరికే అట్లా నవ్వుతావేం?

తను అట్లా నిద్రపోతున్నట్లు పడుకోటం యెందుకనుకున్నాడో, యేమిటో ? గొట్టం తీసి చూస్తున్నాడు.

"నిజంగానండి, మీ బూడ్సులచప్పుడు వినే లేచాను. నిజం డాక్టరుగారూ."

"లేచి మెల్లిగా ఒక్కచూపు చూశావుకదూ. నీకు నిద్ర చెడిపోతుందని ఒక్క రవ్వ చప్పుడు చెయ్యకండా నుంచుంటే, నీకు నా బూడ్సుల చప్పుడు వినపడ్డదా, దొంగ పిల్లా" మళ్ళీ బిగ్గరగా నవ్వాడు.

ఆ నవ్వు విని అమ్మ వచ్చింది. రబ్బరుగొట్టం బైటికి తీశాడు. మళ్ళా "జరంలేదు. ఏం లేదు. లేచి తిరగరాదూ ? లేస్తే పనిచెయ్యాల్సి వస్తుందని భయమో, ఏమిటో" అన్నాడు.

"చాలా అర్భకురాలండీ" అంది అమ్మ.

"అమిత గారాబం చేసి అర్భకురాల్ని చేశారు"

అంతసేపు ఏం వింటాడు తన గుండెల్లో ? యెప్పుడూ ఏదో వెతుకుతో గొట్టం జరుపుతోనే వున్నాడు. అమ్మా, అయిందయ్యా !

"మందు బుడ్డేది ? ఒకపూట మందు మిగిలిపోయిందే ! సరిగాతాగదు పెంకితనం. చాలా గారాబం చేస్తున్నారండీ !"

"ఏం చెయ్యను నాయనా ! పదోఏట ఈ గతి పట్టింది దీనికి. యీ ఏడేళ్ళూ కడుపు తరుక్కుపోతోంది. నేను బతికున్న నాలుగు రోజులన్నా గారాబం చెయ్యకపోతే తరవాత ఎవరు చేస్తారు ?"

ఎందుకో అమ్మ తన సంగతి తలుచుకున్నప్పుడల్లా అట్లా ఏడుస్తుంది? తన కేదో అవస్త పట్టిందంటుంది. అందరూ అంతే తన కర్మట తనకేమీ జీవితం కష్టంగా కనబట్టంలేదు. అమ్మా, అత్తయ్యా, మామయ్యా, లక్ష్మి, వెంకన్నా, పిల్లీ తనచుట్టూ, ఇన్ని వున్నాయి. ఇంకేం కావాలి?..... డాక్టరేదో అంటున్నాడు.

"అవునండి. మన సంఘంలో వచ్చిన అనర్థమే అది. మీ అల్లుడు చచ్చిపోవడానికి నిశ్చయించుకోవడంవల్ల, మీ అమ్మాయి బతికివున్నన్నాళ్ళూ బాధపడాలి."

ఇతనూ అంటున్నాడు తను బాధపడాలి అని. ఏం బాధ !

"లేచి తిరుగు. జ్వరం లేదు, ఏమీలేదు"

అమ్మ ముక్కు తుడుచుకుంటూ వెళ్ళింది.

మళ్ళీ చెయ్యి పట్టుకుని నాడి చూస్తో నుంచున్నాడు.

"చూడు, గాజులు యెంత వదులైనాయో? మళ్ళీ తొరగా బలవాలి."

"బలవడం యెందుకేమిటి"

"ఎందు కేమిటి ! యెప్పుడూ ఇట్లానే సన్నగా వుంటే, యెవరికి బావుంటుంది"

"ఎట్లా బలం పట్టించుకోవడం."

"బాగా తినడం, నవ్వడం"

"మరి తినడానికి ఏమీ పెట్టరుగా"

"ఏం కావాలి ఆవకాయీ, అన్నమూనా"

"జావలో పచ్చడి నంచుకోనిస్తారా"

"రేపు అన్నమే పెట్టిస్తాను.... నువ్వు దొంగవేషాలు వెయ్యకుండా వుంటే సరి"

డాక్టరు వెళ్ళిపోయినాడు. మళ్ళీ రేపు సాయంత్రందాకా కనపడడు, తమాషావాడు. ఒకటే వాగుడు, ప్రతివాళ్ళతో చనువే. మునుపటి డాక్టరు మహాగొప్ప చేసేవాడు. మొహం ధుమధుమలాడుతో వుండేది. ఈ డాక్టరెంత మంచివాడో.

అత్తిల్లు

దొడ్లో బొగ్గుల కుంపటిమీద నీళ్ళుపెట్టి విసురుతో కూచుంది అనుసూయ. పక్కన ఆస్పత్రిలో తొట్లు పాకీవాడు కడుగుతున్నాడు. ఆస్పత్రి యెంత అసహ్యంగా వుంటుందో, ఆ వాసనా, మురికీ, ఆ నల్లని బట్టలూ; ఎవళ్ళెవళ్ళోపడుకున్న పరుపులూ, వాళ్ళ ఖర్మం. కంపు యీ దొడ్డికి కూడా కొడుతుంది..... పోయినసారి వీళ్ళింటికి వొచ్చినప్పుడు ఆ పక్కన గుడ్డ కప్పి పీనిగని కూడా పెట్టారు. ఆ డాక్టరేనో, యింకోడో, అంత మంచి డాక్టరు పీనిగనికోస్తాడా.... యింకా అత్తగారికి నయంకాదేం. తనకి మళ్ళీ పుట్టింటికి పోవాలని వుంది. ఆ తెలుగు వైద్యుడు యెన్నాళ్ళు మందిస్తే నయమవుతుంది. అమ్మని వొదిలి ఈ ముసలివాళ్ళిద్దరితోనూ వుండడం యేమీ బాగుండలేదు. మాటిమాటికీ తనని ఎందుకు పిలుచుకొచ్చుకుంటారు యిట్లా. తమ కొడుకు పోవటానికి తను కారణమని అప్పుడేడ్చారు. ఆ కొడుకు పోయినందుకు అతని బాలవితంతువు తమకి యావజ్జీవం వీలైనప్పుడల్లా సహాయం చెయ్యాలని గావును వీళ్ళ వుద్దేశ్యం. వీళ్ళు పంపమన్నప్పుడల్లా అమ్మ కూడా మాట్లాడకుండా తనని పంపుతుంది. యీ ముసలాళ్ళ ఆస్థి తనకి వొస్తుంది అని అమ్మ ఆశ. ఓ చిన్న కుర్రాడ్ని తనకి పెంపకం చేసి వొదినెగారి పిల్లనిచ్చి పెళ్ళి చేస్తానంది.

ఎవరూ తలుపు కొడుతున్నారు బైట.

అనుసూయ లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా డాక్టరు ప్రకాశరావు నుంచున్నాడు.

"నువ్వు" అన్నాడు.

తలవొంచుకుంది.

"ఆర్నెల్లయింది కదూ..... మళ్ళా నీకు ఎప్పుడన్నా జబ్బుచేస్తుందేమోనని చూశా - ఎందుకు జబ్బు తెప్పించుకోలా"

"ఎందుకొచ్చారిప్పుడిక్కడికి."

"ఈ ఇంట్లో మహాలక్ష్మమ్మగారిని చూడ్డానికి"

"మా అత్తనా."

"మీ అత్తేమిటి. మేనత్తా."

"కాదు."

"ఇంకేమిటి."

వూరికే ఎందుకీ ప్రశ్నలు, అర్థంకాదూ.

"అత్తవారు....."

"ఆహా, పద-"

వెళ్ళిపోయేటప్పుడు గది బయట-

"నిన్ను మళ్ళా యెప్పుడు చూస్తానా అని యిన్ని నెలలూ అనుకుంటున్నాను. ఎందుకు కనపడలేదూ."

"ఎక్కడ."

"ఎక్కడన్నాను. కనపడలేదేం -"

"ఎందుకు-"

ఇంక ప్రతిరోజూ ఆ యింట్లో వొంటరిగా కూచుని యేం తోచక డాక్టరుగారిని యెదురు చూడ్డం అలవాటయింది. అప్పుడప్పుడు; బావిదగ్గర నీళ్ళకి వెళ్ళినప్పుడల్లా ఆస్పత్రివేపు చూస్తుంది. ఎప్పుడన్నా ఒక ఆస్పత్రి బంగళానించి యింకో బంగళాకి వెడుతో దూరంగా కనిపిస్తాడు. పన్నెండు ఒంటిగంట దాకా వుంటాడు, తమ భోజనాలు అయిందాకా ఆయన వెళ్ళిన సంగతి ఆస్పత్రి నిశ్శబ్దమే తెలుపుతుంది. మళ్ళీ సాయంత్రం జనం నిండుతారు. ఎప్పుడన్నా ఆస్పత్రిలోంచి తనవంక చూస్తాడేమో! ఏదన్నా పనిమీద, తమ దొడ్డికీ, ఆస్పత్రికీ మధ్యనున్న తీగల దగ్గిరికి వస్తే! తనని పలకరిస్తే ఎంత గొప్పగా వుంటుంది తనకి. అందరూ ఏమనుకుంటారు. తన గొప్పతనం తెలుస్తుంది. వాళ్ళందరిమీదా అధికారం చేసి బాగా వాళ్ళని, కోసి చేదు మందులు పోసేవాడు. ఎంతో సంతోషంతో తనని పలకరించడం, కాని రాడు. తనని అంత దయగా పలకరించినా, మళ్ళీ అప్పుడే మరచిపోతాడు. అంత గొప్ప పనులలో తను ఏ మూల. ఇలా ఎంతమంది రోగుల్ని పలకరిస్తాడో, ఎంత మందితో దయగా వుంటాడో.

కానీ తోచకుండా వుండే యీ యింట్లో ఆ ఆస్పత్రివంక చూడడం కొంత పొద్దుపోతుంది. ఎప్పుడూ గొణుగుతో వుండే ఆ అత్తనించి తప్పించుకోడం, ఆ కాళ్ళకు రాసే ఆ నూనెవాసన. అబ్బా ! కొంచెం అత్తరు కలపడానికి ఒప్పుకుంటాడేమో డాక్టరు. ఆ చీకటి గదిలోంచి ఆ వాసన నించి బయటపడి ఆస్పత్రి చెట్లకింద నీడల్ని, పచ్చని గడ్డిని

చూడడం ఎంత ఆహ్లాదకరంగా వుంటుంది. ఆ గచ్చు వరండాలు కళ్ళకి ఎంత చల్లగా వుంటాయి. కాని అంత అందమయిన యిళ్ళలో ఆ బాధ యెలా భరిస్తాడో డాక్టరు.

ప్రతి మధ్యాహ్నం వస్తాడు డాక్టరు. ఆయన్ని చూస్తే అత్తకేమీ సంతోషం లేదు. ఎందుకో? తన జబ్బులో యీ డాక్టరు రావడం ఎంత ఆనందంగా వుండేది. ఈ అత్తవారింటిలో ఆ డాక్టర్ని చూస్తే తన పుట్టింటివేపు బంధువుల్ని చూసినట్టే వుంటుంది.

ఒకనాడు డాక్టరు చేతులమీద నీళ్ళుపోస్తోంది.

"కోటుమీద పొయ్యకుమరి.... పొద్దున్న దానిమ్మ చెట్టుకింద నుంచుని చూస్తున్నావే. ఏమిటి సిగ్గెందుకు?... నన్నా. నేనూ... (ఆగి) మరి యీ రాత్రి కూడా రావాలి... ఎంతబావున్నావు ఆ చెట్టుకింద. పిచ్చిపిల్లా. ఎందుకు అలా చూస్తావు. నీకేం తోస్తుంది యీ యింట్లో. పాపం రాత్రి ఎనిమిదింటికి వస్తాను.... ఒకడు చచ్చేట్టున్నాడు. అందుకని.... అప్పుడొకమాటు కనబడవూ. ఆ చెట్టుకింద కాదు... చీకటి. తీగెల దగ్గిరికి రా.... సబ్బు మంచివాసన వేస్తోందే. ఎక్కడకొన్నావు... దొడ్లో తీగెల దగ్గిరికి రా.... యెనిమిదింటికి... నీళ్ళు.... తమాషాకి ఒక మాట మాటాడు. యేం తోచదు... వస్తావు కదూ... చాలు... తువ్వాల..."

అనుసూయ ఏమీ అనలేదు. రాత్రి ఎనిమిదింటిదాకా ఆ సంగతి యెక్కువ ఆలోచించనేలేదు. ఎనిమిదింటికి యెలా వస్తాననుకున్నాడు. భోజనాల సమయం. తను వడ్డించనక్కరలేదూ, వంటకేగా తనని పిలుచుకుంది వీళ్ళు.

వడ్డిస్తూ ఆలోచిస్తూనే వుంది. ఎనిమిది దాటింది. తీగెలకేసి చూస్తాడు. ఎలా వస్తుందనుకున్నాడు. అంతమాత్రం తెలీదూ. ఎందుకు రమ్మన్నాడో. అతనికీ తనమల్లేనే యేం తోచదు గావును. ఆ చీకటి ఆస్పత్రిలో భయమేమో. రాత్రి యెవరికి మందులివ్వాలి. పాపం ! ఈ డాక్టర్లకి యెంత కష్టం..... ఇంకా వుంటాడా - తను కనపడకపోతే అతనికి లక్ష్యమా అయినా వున్నాడేమో.

మజ్జిగ పోసేసి, దొడ్డిగుమ్మం దగ్గిర్నించి ఒక పరుగు తీసింది. రాత్రి గాలిలో పరిగెత్తడం యెంతో బాగుంది. చిన్నతనంలో భయమేసి, యింటోకి పరిగెత్తడం జ్ఞాపకమొచ్చింది. తీగెలదగ్గర పచార్లు చేస్తున్నాడు. ఆ పొడుగాటి గొట్టాలవంటి కాళ్ళతో, వుంగరాలు నుదురుమీదపడి మెరిసే జుట్టుతో.

"ఇంతసేపటికా రావడం:"

"మరి భోజనాలు కానక్కర్లా..... సరే చెప్పండి"

"ఏమిటి చెప్పడం."

"మరి యెందుకు రమ్మన్నారు."

"వూరికే యిలా నుంచోడానికే"

"మరి నేను వెళ్ళాలి. వాళ్ళు లేచేటప్పటికి."

"మళ్ళీ ఎప్పుడొస్తావు"

"ఇంక రాను. అత్తకి కాళ్ళు పిసకాలి. అక్కడే నిద్ర వచ్చేస్తుంది."

"వెళ్ళిపోతావా ? అప్పుడే ! నీ మొహమన్నా కనబట్టం లేదు ఆ నీడలో. ఇట్లారా మరి... వూరికే ఒక్క నిమిషం అలానుంచో చాలు. వీళ్ళ ఇంట్లో నీకు సంతోషంగా వుందా !"

"లేదు. అమ్మ దగ్గిరికి వెళ్ళాలని వుంది"

"అక్కడ నీకు బాగుంటుందా"

"ఆ...."

"వొంటరిగా వుండదూ? నీమీద ఎవరు ప్రేమ చూపుతారు. ముందేం చేస్తావు ?"

"ఏం చేస్తా....."

"మీ అమ్మ చచ్చిపోతే..."

"ఎందుకిదంతా ! వెడుతున్నా."

"అప్పుడే !"

"వాళ్ళు పిలుస్తారు."

"చెయ్యి యిట్లా జాచు. సన్నని వేళ్ళతో కొనతేరిన నీ చెయ్యి ఎంత బాగుంటుందో తెలుసా ?"

"అందుకనేనా అంతసేపు నాడి చూసేవారు ?"

నవ్వి బుగ్గమీద కొట్టాడు.

అనుసూయ చెయ్యి పట్టుకుని తీగెలదగ్గరికి లాగి భుజం మీద చెయ్యి వెయ్యబోయినాడు. అనుసూయ పరుగెత్తుకుని వెళ్ళింది.

రాత్రి పడుకోబోయేముందు పక్కన దీపం పెట్టుకుని అద్దంలో తన మొహం చూసుకుంది. చీకటిలో తన సన్నని పెదిమలు అతనికి కనపడ్డాయేమో? ఎందుకో తనమీద యిష్టం ! చేతినీ, వేళ్ళనీ నిదానించి చూసుకుంది. అక్కడ పట్టుకున్నాడు, కొంచెం నలిగినట్టు ఎర్రగా, ఇంకా కనబడుతోంది అనుకుంది. పనివల్ల గోళ్ళు అరిగిపోయినాయి. వాళ్ళ సుందరమ్మ గోళ్ళమల్లె ఎర్రగా, గుండ్రంగా చంద్రవంకలవలె వుంటే అతనికి ఇంకా ఎంత బావుండేవో ! అతనికి బాగుండడం ఎందుకు ? అని అనుకునేటప్పటికి మెరుపువలె వెన్నెముక వెంటసంతోషం యెక్కింది. ఆ ప్రశ్నే అడుక్కుంటో పడుకుంది. దానికి ప్రత్యుత్తరం మొగ్గల్లో పరిమళం వలె దాగి వుంది. ఎంత వెతికినా కనపళ్ళేదు ఆ రాత్రి.

అత్తకి జబ్బు నయమయింది. కాని స్నేహంవల్ల గావును డాక్టరు మామగారిని చూడడానికి వస్తూనే వున్నాడు. తీరికయినప్పుడల్లా రోజూ రెండు మూడుసార్లు. ఇంకా

అనుసూయ తల్లిగారింటికి వెళ్ళలేదు. ఒకరోజు మధ్యాహ్నం ప్రకాశరావు లోపలికి రావటానికి అనుసూయ తలుపు తీసింది.

"ముసలివారేరీ"

"ఒకరు నిద్రపోతున్నారు. ఇంకొకరు వంటింట్లో కాఫీగింజలు వేయిస్తున్నారు."

"మూడోవారు తలుపు తీశారు."

"మామగారిని లేపనా ?"

"ఒద్దు మళ్ళీ వస్తా ! వచ్చిన కార్యం గుమ్మం దగ్గరే తటస్థపడ్డది. యెంత బాగున్నావో యిప్పుడు ! తలంటిపోసుకున్నావు కదూ? పొద్దున చూశాను నువ్వుచేసే ప్రయత్నమంతా. ఇట్లా మొహం పక్కకితిప్పి నుంచో, బాగా చూడనీ, ఒక్కసారి ముద్దు పెట్టుకోవద్దా మరి ?"

దగ్గరగావచ్చి నడుంమీద ఒక చెయ్యివేసి, ఇంకా దగ్గరగాలాక్కుని చెంపమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. వదిలెయ్యగానే అనుసూయ పెద్ద సిగ్గుతో లోపలికి వెళ్ళింది. అతనువెళ్ళిన చప్పుడు వినపడగానే, అద్దంముందు నుంచుని పదినిముషాలు తన వంక తనే చూసుకుని, జుట్టు అయిదారు విధాల మొహంమీదికీ, పైకీ పాపిడితీసి చూసుకుంది. కళ్ళకి కాటికే పెట్టుకోనిస్తే, ఇంకా ఎంత బాగా కనిపించేదాన్నో అనుకుంది. ముడి వేసుకున్నా, పూలు పెట్టుకోనీరు. చేతిలో గులాబి పువ్వు పట్టుకుంటేనే అత్త కోప్పడ్డది. వాళ్ళ జానకి మరువం తలలో పెట్టుకుని నడుస్తోంటే యెంత మంచి వాసన వస్తుంది ! చామంతిపూలు, పచ్చగా నల్లని జుట్టుమీద ఎట్లా మెరుస్తాయి జానకి తలలో.

ఇంక ఆవాళ యేం తోచలేదు. కొంతసేపటికి పూర్తిగా అర్థం కాని భయమేదో తట్టింది. ఇంకా వీళ్ళు తనని అమ్మదగ్గిరికి పంపరేం ? అమ్మన్నా కబురు పంపదేం? కొడుకు చచ్చినా కోడలుమీద ప్రేమ పోనివాళ్ళు వీళ్ళు మాత్రం కనపడుతున్నారు లోకంలో....

రెండు రోజుల తర్వాత మధ్యాహ్నమప్పుడు, ముసలమ్మ అనుసూయని చూసి....

"ఏమే, మరీవాస్తోంది. జుట్టు అట్టా పైకి దువ్వావేం ?"

"దువ్వితేనేం ? ఏం దువ్వాను !"

"ఏమిటే ఈ వేషాలు మరీని"

"ఏం వేషాలు ? అందరూ ఇట్లానే దువ్వుతున్నారు."

"అందరూ ఎవరూ ? మరీ పోకిళ్ళు పోతున్నావు. కిరస్తానీ పంతులమ్మవా ?"

"మనవాళ్ళే దువ్వుకుంటున్నారు. సోమంచివాళ్ళ అమ్మాయి జుట్టు చూడండి."

"దానికేం ! దాని మొగుడు నేర్పుతున్నాడు. అవన్నీ దాని ఇష్టం. దాని-మొగుడి ఇష్టం. ఏం మీ అమ్మనడుగుతాగా ? యెవరన్నా చూస్తే ఏమనుకుంటారు ? ఇన్నాళ్ళు

నీకు జుట్టు అట్టిపెట్టినందుకే అనేక మాటలంటున్నారు. మంచిదానివే ! మా పరువు బాగా నిలపెడతావు ? యెవరి కోడలంటే నవ్వులచేటు. ఛీ ! ఛీ !"

అనుసూయకి ఏడుపొచ్చింది.

"అమ్మ యేమీ అనదు. నేనిక్కడ వుండను. అమ్మదగ్గిరికి వెడతా"

"ఎన్నాళ్ళని ఉంటావు అమ్మదగ్గిర? రేపేదో పెంపకం కాగానే యింకెక్కడ వుంటావు. యిక్కడ కాక ! వెడుదురుగానిలే యెల్లుండి తద్దినం కాగానే"

ప్రకాశం వచ్చాడు.

"ఏమిటి తగూలాడుతున్నారు ?"

"ఏం లేదులెండి"

అనుసూయ లోపలికి వెళ్ళింది.

"ఈ కాలపుపిల్లలకి మరీ మతిపోతోంది. అప్పన్న మందుమతులన్నీ వీళ్ళకే పుడుతున్నాయి. ఆ మొగుళ్ళు ఆడించడం, కోతుల్లాగా వీళ్ళాడడం, మొగాడు ఎన్ని పోకిళ్ళన్నా పోతాడు. కాని ఆడదానికి బుద్ధి వుండాలి. అయినా మొగుళ్ళున్న వాళ్ళ సంగతి వేరు ! దీనికీవేషాలేమిటి చెప్పండి."

"ఎవరికి ?"

"ఇంకెవరికి మా కోడలుమాట చెబుతున్నాను. దీనికి ఎవరున్నారు? ఎవరికోసం ఆ షోకంతా ? మహాకాళి, ఉన్న వొక్కణ్ణి మా కుర్రాణ్ణి పొట్టన పెట్టుకుంది. ఆనాడే అన్నాను వెంట్రుకలు తీయించమని. కాని ఆ తల్లి ఏడ్చిపట్టుపట్టింది. ఆ వంశమే అట్లాంటిదిలెండి. దీని మేనత్త సంగతి తెలుసుకదూ? అది పోనీలెండి మరి మరి మా కోడలై చచ్చిందిగా. దీని బుద్ధులు చూడండి నలుగురు చూస్తే ఏమనుకుంటారు ?"

"ఏం చేసింది ?"

"మొన్నటన్నించీ యేంపుట్టిందో తెలీదు. ఆ గోళ్ళన్నీ కత్తితో గీసింది. ఆ తలచూశారూ ఎట్లా దువ్విందో ! యెవరికోసమండి ఆ షోకంతా. ఇదివరకు ఇట్లాంటివేమీ లేవు."

"పాపం చిన్నది. పెద్దవారు మీరు అట్లాంటివన్నీ లెక్కలోకి తీసుకుంటారా?"

"చిన్నదేమిటి ? పదహారేళ్ళొచ్చాయి. వాడేవుంటే ముగ్గురు పిల్లల తల్లి కావలసింది. ఎట్లానూ రేపు కార్తీకమాసంలో జుట్టు తీయిస్తూనే ఉన్నాములెండి. ఈ లోపల దీనికేం పుట్టిందో ?"

"ఏం తీసేయిస్తారు ?"

"వెంట్రుకలు తీయించమూ మరి ?"

పతివ్రతలారా, పాపం అనుసూయమీద కోప్పడకండి. తక్కిన స్త్రీలకన్నఏమీ దుర్మార్గురాలు కాదు అనుసూయ. ఆ వయసులో ఎట్లా తక్కిన అవయవలక్షణాలు

కలుగుతాయో ఈ ఆలోచనలు కూడా అంత సహజంగానే కలుగుతాయి. తడి భూమిని బద్దలు చేసుకుని తలయెత్తే మొక్కని చూస్తే, లోకంచుట్టూ చూసి ఆనందపడుతున్నట్టు తోచదూ. యీ యెండని, గడ్డినీ, మంచుని చూసి, అట్లానే అనసూయ కొత్త రొమ్ములు, యీ కొత్త ఆలోచనలు, యీ లోకపు సౌందర్యాన్ని, పువ్వుల్ని, పురుషుల దృఢవక్షాల్ని, మందమారుతాల్ని చూసి ఆనందిస్తున్నాయి.

పవిత్రవంతులై, మీ ధర్మ భర్తలవల్ల సంతానాన్ని పొంది, సుఖంగా కీర్తితో సంసారాలు చేసే మీరు, పాపం, అనసూయను చూసి కఠినత్వం దాల్చకండి. మీరు పదహారేళ్ళ వయసులో వున్న రోజులు తలచుకోండి. మీ కొత్త అవయవాలు, మీ కొత్త ఆశలూ, యింత విజృంభించి ఉండవు. ఎందుకంటే వాటిని నలిపి ఎదగకుండా, గర్వించకుండా, అణగగొట్టేందుకు నాధులు సిద్ధంగా ఉన్నారు గనక. పాపం, అనసూయకి ఆ దురదృష్టం లేదు. క్షమించండి ఆ పిల్లని పాపం !

పుట్టిల్లు

అనసూయ బైట అరుగుమీద కూచుని ఉంది. మునిసిపల్ చాకలాడు దీపాలు ఒక్కొక్కటే వెలిగించుకొంటూ వస్తున్నాడు. కూలివాళ్ళు గుంపుగా పాటపాడుతో ఇంటికి వెడుతున్నారు. యెదురుగా సాయేబు గంట వాయించి బొంబాయి మిఠాయి అమ్ముతున్నాడు. కుడుతూ కనబడక వేలులో సూది గుచ్చుకున్న అనసూయ కుట్టే రెవికని ఒళ్ళో పెట్టుకుని రోడ్డువంక చూస్తో కూచుంది. ఎదురుగా వచ్చేది డాక్టరు ప్రకాశరావా ? ఆ పొడుగూ, ఆ నడకా అట్లానే వుంది. ఐతే పంచ కడతాడా ? ఆ టోపీ ఎన్నడూ అతని నెత్తిమీద చూడలేదే? ఇందాక ఇటువెళ్ళాడు. మళ్ళీ ఇప్పుడు తిరిగి వొస్తున్నాడు. ఇటే వస్తాడుగావును? ఒక్కనిముషం ఆలోచిస్తున్నాడు. అతనే ! అవుగో ఆ చిన్న పొట్టి మీసాలు ! వొస్తున్నాడు. ఎందుకా దడదడ నీకు-కనబరచకు-యింట్లోకి వెడుతున్నట్టుండు-దగ్గరికి వొచ్చాడు. "అనసూయా !" అని దగ్గరికి వచ్చాడు. 'తొమ్మిదింటిదాకా ఉత్తరంవేపు లాంతరు దగ్గిర ఉంటా - ఒక్కసారి యీ లోపున అటురా!'' అని వెళ్ళిపోయినాడు.

తీగెలదగ్గర మాట్లాడిన నాటినించి మళ్ళీ కనబడలేదు. ఈ డాక్టరికి మళ్ళీ తన జోలి యెందుకు ? అమ్మ దగ్గరికి వచ్చింతరువాత కొన్నాళ్ళు చూసింది అతను వస్తాడేమో నని ! అతనురాకపోవడం మనసుని బాధపెట్టింది. కాని తొరలోనే మరిచిపోయింది. ఇప్పుడెందుకు, రోడ్డుమీద మాట్లాడాలా - కాని ఆ లాంతరు వెనకంతా చీకటే. ఎవరూ ఉ ండరు. అతనికెట్లా తెలుసో ! వెళ్ళడం మంచిదేనా ? ఎందుకు వెళ్ళాలి ? వెళ్ళాలని పిస్తోంది, కారణం తెలీకండానే. అతని కంఠం ఒక్కసారి వినాలి. తనకి ఇప్పుడు బాగా బలం పట్టింది. చాలా బావున్నానని అతను అంటే ?

అందరికంటే త్వరగా భోజనం చేసింది. మజ్జిగన్నా వేసుకోలేదు. చప్పున రెవిక మార్చుకుని, చప్పుడు కాకుండా గడియతీసి రోడ్డుమీదికి వెళ్ళింది. దీపాలకి అవతలగా తలవంచుకుని త్వరగా నడిచింది. దీపంకింద యెవరూలేరు. ఒళ్ళు మండింది. తొమ్మిది దాటలేదుకద ! ఆ మామయ్యా ఎంతకీ భోజనానికి లేచాడు కాదు. నిరాశతో చప్పున వెనక్కి తిరిగింది.

"అనుసూయా !"

సందు మొదట్లో నుంచున్నట్టున్నాడు. దొంగ, వెళ్ళలేదు ! ఇట్లా వచ్చేస్తే ఏమనుకుంటాడు ? ఒక్క ముహూర్తం ఆగింది, కాని ఇంతదూరం వచ్చి అనుకునేదేమిటో ఇదివరకే అనుకున్నాడు.

"ఎందుకు ! త్వరగా చెప్పండి"

"ఈ సందులోకి రా. ఎవరూ లేరు."

"రాను. చెప్పిండి వెడతాను"

"ఇక్కడెట్లా ? రోడ్డుమీద మనుష్యులు నడుస్తో వుంటారు. అట్టా రా ఒక్క నిముషం"

చీకట్లో వెళ్ళడం భయం. కాని డాక్టరున్నాడుగా ! ఆ వెనక గడ్డివాము; దానిపక్కన మామిడిచెట్టు వుంది. తలుపుతోసి లోపలికి తీసికెళ్ళాడు. చెట్టునీడ కింద నుంచుని అనుసూయ మెడచుట్టూ చేతులు వేశాడు. అతని గుండెలు ఆయాసంతోవలె ఒకటే కొట్టు కోవడం. అతని చేతులు వొణకడం, అనుసూయకి తెలిసి భయం వేసింది. ఆమె భుజాలమీద చేతులతో పట్టుకున్నాడు.

"అనుసూయా ! నువ్వు లేకుండా నాకు చాలా కష్టంగా వుంది. ఎప్పుడూ నువ్వే జ్ఞాపకమొస్తున్నావు. ఎన్నిసార్లో నిన్ను చూడాలని మీ ఇంటి వేపే నడిచాను. నా మీద దయలేదూ ? చెప్పు. ఇట్లా చూడు."

అనుసూయ మొహాన్ని ఎత్తి ముద్దు పెట్టుకున్నాడు. ఎంత బావుంది. ఇట్లాంటి సుఖ మొకటి లోకంలో వుందని అనుసూయకి తెలీదు. భార్యా భర్తలు యధావిధిగా పిల్లలకోసం ఏదో చేస్తారనుకుంది గాని ఈ నరాలు కాల్చే అనుభవం ఆమె అనుభవంలో లేదు.

"నిన్ను చూస్తే నాకెంత ఇష్టమని ! ఇట్లారా, నన్ను ముద్దుపెట్టుకో, రా" గట్టిగా అదిమేస్తున్నాడు. ఎంతబలమో ! ఎంత బావుంది, అంత దగ్గిరగా నుంచోడం ! ఎంత బావుంది !

"ఎంత బావున్నావు, అనుసూయా ! నీ కళ్ళు ఎంత అందంగా చూస్తున్నాయో దగ్గిరిగా రా, ఎందుకా భయం, సిగ్గు నేనేగా ! ఇంక నిన్ను వదలను ఎన్నడూ. ఇట్లా పట్టుకుంటాను ఎప్పుడూ. ఇక్కడే తెల్లవారినా సరే వెళ్ళకు ఇంకోసారి...."

అబ్బా ఏమిటీ ఆనందం ! పరుగెత్తుతోంది. వళ్ళంతా దూకుతూ ఎంత బావున్నాయి ఆ మాటలు. తన కోసమే, తనెందుకు అతనికి ? ఎప్పుడూ ఆ మాటలు వింటో, అలా చేతుల్లో అంత దగ్గరగా ఆనుకుని వుండడం బావుంటుంది. ఇంకా పైకి లాక్కుంటున్నాడు. యేమిటి ఆ చేతుల్తో చేస్తున్నాడు? అబ్బా వొద్దు, ఏమిటిది ఛా ! ఛా !.... భయం, సిగ్గు, వొద్దు వొద్దు. తప్పులో పడిపోకు-పాపం..... అమ్మ వాళ్ళకి తెలిస్తే-ఇట్లా చేస్తాడనుకోలేదు వదిలించుకుని దూరంగా నుంచుంది. వచ్చి మళ్ళీ పట్టుకున్నాడు.

"రా, ఎందుకు వెళ్ళిపోతావు ? నేనేగా, రెండు నిమిషాలు, ఇప్పుడే వెళ్ళిపోదుగాని"

మళ్ళీ బలవంతంగా లాక్కుపోయాడు. లోబడకూడదు. ఏదో తెలీని అద్భుతమయిన ఆశ, వణుకు, ఆత్రుత, బాధ లొంగిపొమ్మని అరుస్తున్నాయి.

"చూడు, ఆ విచిత్రం - ఆ అసమాన్యానుభవం రుచి చూడు" అంటున్నాయి.

"వొద్దు వొద్దు తప్పించుకో, పాపం, నీచం, భయంకరం, నీకింకా తెలీదు దీని పర్యవసానం" అని నిబంధనలు, స్త్రీ సహజముగ్ధత్వము లజ్జ, భయము అరుస్తున్నాయి.

"నన్నాట్లా తాకకండి. ఇంకెప్పుడూ రాను, వెళ్ళండి" విచిత్రమయిన కఠినత్వం వచ్చింది కంఠంలోకి. కొత్తబలం వచ్చింది చేతుల్లోకి. తోసేసింది. తన్నుకుంది. అతడు అదుముతున్నాడు.

"లొంగిపోతున్నావు, పోట్లాడు"

మోహమూ, ప్రేమా మాయమైనాయి.

"వీడా నన్ను బలవంతంచేసి, నీచంగా లోబరుచుకునేది !"

పోట్లాడింది.

"అరుస్తా, వదులు ముందు గాడిదా" తప్పించుకుంది. జుట్టుఊడింది, మొహం నలిగింది, చంపలమీదా, వంటిమీదా రక్కులు మెల్లిగా తుడుచుకుంటో కుచ్చెళ్ళెత్తి పట్టుకుని, జుట్టు వళ్ళంతా పడుతో పరిగెత్తింది. ఆ రూపం చూసేప్పటికి ప్రకాశరావుకి కళ్ళు తిరిగి రక్తం చిందులాడింది. ఇట్లాకాదు ఎప్పుడూ తనకి కావలనప్పుడల్లా నెమ్మదిగా, శాంతంగా, అందమంతా అనుభవించేందుకు వీలుగా దొరకాలి. త్వరంగా వెళ్ళి లాంతరు ఆవతల అనుసూయని కలుసుకున్నాడు.

"ఏం చెయ్యను. రేపు ఒక్కసారి రా"

"ఈసారి నన్ను రమ్మంటే అమ్మతో చెపుతాను. వెళ్ళు, పో !"

అతని మొహంవంక కంటిచివరినించి చూచి మొహం తిప్పేసుకుంది. ఆ ఒక్క చూపులో ఆమె మొహంలోకి జాలి వచ్చింది. ఆగి -

"మరి నన్నెందు కట్లా చేశారు ? తప్పు కదూ ! వెళ్ళండి నేను మాత్రం రాను."

"నామీద కోపమేనా ?"

"కోపంకాదు, ఏంకాదు."

అనుసూయ యెవరన్నా తనని చూస్తారేమోనని భయంవేసి, వెంటనే పడుకుంది. ఆ సంగతే జ్ఞాపకమొస్తోంది. ఆ సంతోషమూ, ఆ భయమూ, ఆ ముద్దూ, ఆ అసహ్యమూ అన్నీ మళ్ళీ తోచాయి. ఒక్కొక్కప్పుడు అతను మృదువుగా తాకిన శరీరాన్ని తలుచుకున్నప్పుడు, మళ్ళీ దాన్ని ముద్దు పెట్టుకోవాలనిపించింది. కాని ఆ గోళ్ళు గుచ్చిన స్తలాలు - నోటితో, వేళ్ళతో గట్టిగా పట్టుకోడం యెంగిలి తలుచుకుంటే, అప్పుడే లేచి తలంటిపోసుకోవ లనిపించింది.

మొండివాడు. మర్నాడు సాయంత్రం ఒక చీటీ పడేసి వెళ్ళాడు. దాంట్లో మళ్ళీ రమ్మన్నాడు పైగా.....

"నీ జుట్టు తీసేయించాలని చూస్తో వుంటారు, బహుశా. నువ్వు నా దగ్గరికొస్తే వచ్చావు. రాకపోతే పోయినావు. దానికి మాత్రం ఒప్పుకోకు. అది చాలా అసహ్యం. నీకే సహాయమైన్నా చేస్తాను."

తను వెళ్ళతలుచుకోలేదు. పాపం అంత గొప్పవాడు ! అందరూ గౌరవించేవాడు. తనని అంతగా కావాలని పిలిస్తే తనుతిట్టినా, కోపంతెచ్చుకోక, తనని మళ్ళీ కోరి, తన జుట్టు మీద అంత శ్రద్ధ తీసుకుంటున్నాడు. దీపం వెలుగులో ఎంత తెల్లబోయి, సిగ్గుపడి, కనపడ్డదో అతని మొహం! ఒకసారి వెళ్ళిచూస్తే, కాని మళ్ళీ అలా మొదలు పెడితే, ఎవరన్నా చూస్తే వెళ్ళగూడదు.

ఇదివరకు తల వెంట్రుకలు తిస్తారంటే ఆ సంగతి విచారమే కలిగించలేదు. మామూలుగా జరగడం లాగుంది. కాని ఇప్పుడు భయం పట్టుకుంది. తనకిష్టంలేదని తక్కిన వాళ్ళకి తెలియచెయ్యాలి. ఎలా ! ఆ సంగతి ఎత్తినప్పుడల్లా ముఖం మాడ్చడం, తనకి పట్టనట్టు తిరగడం చెయ్యాలనుకుంది. అసలు అనుసూయకి తన నిగనిగలాడే జుత్తుని చూస్తే చాలా ఇష్టం. ఆ ప్రేమంతా మనసులోంచి ఇప్పుడు పైకి తోచింది. ప్రకాశరావుని మాటలని నొప్పించింది. దానికి పరిహారంగా ఇప్పుడతనుచెప్పినట్టు జుట్టుని కాపాడుకోవాలి. ఈసారి అతను చూచినప్పుడు అందంగా కనపడవద్దూ ! తనని ఇదివరకటివలెనే వున్నదని చూడవస్తే తను అమ్మలాగు బోడి గుండేసుకొని ముసుగుతో.... ఛీ.... ఏమైనా సరే ఒప్పుకోకూడదు. గడ్డివాముకి ఆనుకుని తన జుట్టులో అతని వేళ్ళని దూర్చి.... ఏమయినా సరే ఒప్పుకో కూడదు. తనకిష్టంలేదని చెప్పేసింది స్పష్టంగా ఒకసారి.

వెళ్ళలేదు. కొన్ని నెలలదాక అతనివేపు చూడలేదు. అతనెంత తిరిగనా ఎన్ని చీటీలు రాసినా.

* * *

తల్లీ, మేనమామ అనుసూయ బాధకు సానుభూతిని జూపారు. కాని మామ భార్య ఒప్పుకోలేదు. తలవెం(ట్రుకల విధవ తన ఇంటిలో వుండకూడదదంది. తక్కిన బంధువులు వాళ్ళకి తలవంపులనీ, అటువంటి ఆనవాయితీ తమ ఇంటిలోలేదని అన్నారు. ముఖ్యంగా అత్తవారు ఒప్పుకోలేదు. చచ్చిపోయిన తమ కొడుకు ఆత్మ భార్య గుండుని చూసి కాని పరలోకానికి పోదనుకున్నారు. బంధువులలో ఆందోళన ప్రారంభించింది. 'డిస్టర్బు' అయిన చెట్లమీద తేనెటీగ ల్లాగు ధ్వని చేస్తున్నారు. బలవంతంగానన్నా లాక్కెడతామన్నారు. అనసూయకి భయంపట్టుకుంది. ప్రకాశరావు సహాయం అడిగితే- ఏం చేస్తాడు? కాని అడగకూడదని అడిగితే అతని చేతుల్లో చిక్కినదానినౌతానని అంతరాత్మ పలికింది.

అత్తిల్లు

చేతిలో చీటీ పట్టుకుని సాయంత్రం అనుసూయ ఆలోచిస్తోనుంచుంది. ఆమె కళ్ళల్లోకని దూరదృష్టిని జూసే ప్రియుడే ప్రక్కన వుంటే పరవశుడై ఉండును. ఆమెలోని ఉత్సాహం, హృదయ నిర్మలత్వమూ, ప్రజ్వలించే యవ్వనోద్రేకమూ, ఆమెకి లేని అందాన్ని కూడా తాత్కాలికంగా కల్పించాయి. పిరుదుల దగ్గిర్నించి మెడదాకా మంచి వొంపులుతిరిగి కళ్ళని అక్కడే సంచరించేలా చేస్తుంది. ఏ కవులూ వర్ణించలేని, ఏ మాటలూ వ్యక్తపరచలేని, సాధారణంగా స్త్రీలకి వుండని చార్మ్గ్రేస్ వున్నాయి ఆమెలో. ఏ అవయంలో, ఏ రంగులో వుందో ఆ ఆకర్షణ నిర్ణయించలేరు.

ఈ రాత్రి మళ్ళీ తనని తొమ్మిందిటికి రమ్మంటాడు ప్రకాశరావు. వెళ్ళాలా, వద్దా ? పట్టుదలకి లొంగి ఈ సంవత్సరం వూరుకున్నవాళ్ళు గట్టి పట్టుపట్టారు ఈసారి. ఈ పెంపకమైన కొత్తకుర్రాడికి విష జ్వరం వచ్చినప్పుడు తన తలవెం(ట్రుకలే ఆ జబ్బుకి కారణమని అందరూ నమ్మారు. ఇంతా డాక్టరు ప్రకాశరావు కుదిరిస్తే తన వెం(ట్రుకలు తీయిస్తామనే మొక్కుబడే వాడిని కుదిర్చిందని వాళ్ళ నమ్మకం. వదిలేలా లేరు. అమ్మ కూడా తన వేపు లేదు ఈసారి. అత్త కొట్టడానికి సిద్ధమయింది. మరీ నీచంగా జూస్తున్నారు. ప్రకాశరావుని చూసి అనుమానపడుతున్నారు. ఆయన్ని రమ్మని ఇదివరకు వలె పిలవడం మానారు. తన మీద ఏవో కుట్రలు జరుగుతున్నాయి. సీతారామయ్య మామయ్య తనవేపే కానీ, ఆనాటి రాత్రి అతను నిద్దట్లో చేసిన ఆ పాడు పని తెలిసినప్పటినించి అతనితో సరిగా మాటలాడటం మానేసింది తను. ఇంక తనకి డాక్టరు ప్రకాశరావు సహాయం అడక్క తప్పింది కాదు. తను రాసి చేతిలో తటాలున పెట్టిన చీటీకి బదులు ఈ చీటీ తీసుకొచ్చి ఇచ్చాడు. రాత్రి తీగెల దగ్గరికి వస్తే ఆలోచించ వచ్చుట. వెళ్ళి చూడాలి, వెడితేనేం?

అందరూ పడుకున్న తరవాత దొడ్డి తలుపు తీసుకువెళ్ళింది.

"నేను తిట్టినందుకు కోపం పోయిందండీ ?"

"నా కెందుకు కోపం ! నువ్వా మరచిపోవలసింది. చాలా దుర్మార్గమైన పని చేశాను, నాకు ఒళ్ళు తెలీలేదు."

"అది పోనీండి. యిప్పుడు ఏం చెయ్యమంటారో చెప్పండి."

"ఒక్క నిమిషంలో యేం చెప్పను ? వుండు.... అంతా చెప్పు."

"నేను త్వరగా వెళ్ళాలి, యెవరన్నా చూస్తారు, యేముంది చెప్పడానికి?"

"నీ జుట్టు తీసేస్తారంటే, నీకంటే నాకు విచారంగా వుంది. ఇలా చూడు. తళతళలాడే యీ చక్కని జుట్టు నంతా తీసేస్తే మళ్ళీ నిన్నెలా చూడను."

"చూడకండి"

"చూడకండా బతకగలనా ? యిలా చూడు నా మాటలు అబద్ధంగా కనపడుతున్నాయా ? ఇంకా నమ్మకం లేదూ !"

"సరేలెండి, కాని నాకు ఏం సహాయం చేస్తారో చెప్పండి."

"చెప్పడమెందుకు? పక్కన నే నుండి అలాంటి పని జరగనిస్తానా?"

"ఏం చేస్తారేం ?"

"రెక్కల గుర్రం మీద యెత్తుకుపోతాను. చైనా దేశం వెళ్ళిపోదాం, బాణాలతో యుద్ధం చేస్తాను. అందరూ పారిపోతారు. నీకేం భయం లేదు. నా ధైర్యం నిలవడానికి మాత్రం రోజూ ఒకసారి ఇట్టా కనపడుతో వుండు."

"రోజునా ! రాను. వాళ్ళు కనుక్కోరూ ?"

"ఇక్కడే వుంటే చూస్తారు, అలా ఆస్పత్రిలోకి వెళ్ళిపోతే యెవరూ కనుక్కోరు. నీకేం తోస్తుంది ? యేం సరదాగా వుంది ఆ యింటిలో ?"

"అక్కడికి రానండీ. కాని నన్ను కాపాడే భారం మీది వెడుతున్నాను."

"అప్పుడే వెడతావా !"

"మళ్ళీరేపు వస్తాలెండి ఇక్కడికి."

పాపం..... ఇంకా తెలీదు అనుసూయకి, స్వలాభం లేకుండా జరిగే సహాయం లోకంలో ఎంత అరుదో...... ముఖ్యం పురుషులనించి స్త్రీలకి.

* * *

ప్రకాశరావుని కలుసుకోవడం చాలా గట్టి అలవాటుగా పరిణమించింది. అతన్ని చూడకుండా, మాట్లాడకుండా ఉండలేదు. సంతోషమేమీ లేని ఆమె జీవనానికి అమృతం తాగిస్తున్న వాడివలె ఉన్నాడు ప్రకాశరావు. సరిగా ఆమె హృదయం యవ్వనంలో పురుషుడి కోసం తెరుచుకున్న సమయంలో ప్రకాశరావు ఆమెని సమీపించాడు. ఆ సమయంలో యెవరు ఆ స్థానంలో వున్నా వారే ఆ హృదయంలో అతుక్కునేవారు. అలానే సాధారణంగా

భర్తలందరూ భార్యల హృదయాల్ని వశపరచుకునేది ! భర్త లేని అనసూయకి, భర్త స్థానంలో ప్రకాశరావు నుంచున్నాడు. ఆమె భక్తి, ప్రేమ, సేవ అన్నీ అతనికి స్వభావసిద్ధంగా అవే అర్పించుకున్నాయి. కనకనే హృదయానికి యెంతో అలావాటైనట్టు, సమీప బంధువైనట్టు తల్లి కన్న, బంధువులకన్న, తనకన్న, తన నీతికన్న, పేరుకన్న, ఎక్కువైనాడు. నిజమైన భర్తగా, శాస్త్రాల్లో చెప్పినట్టు ! నిజమైన దైవమయినాడు ఆమెకి. మొదటి హృదయ బంధం వొదుల్చుకోవడం కష్టం.

పెరుగుతున్న తీగె యెలా ఆధారం కోసం వెతుకుతుందో నవయవ్వనంలో వున్న కన్య హృదయం ప్రేమకోసం అలానే వెతుకుతుంది. అది సృష్టిలోనే ఏర్పడ్డది. మనుషుల మనసుల ఆధీనంలో లేదు. వాన భూమిమీద పడకుండా ఆపడం ఎంత సులభమో, స్త్రీ హృదయంలోంచి ప్రేమని అడ్డుపెట్టడం అంతే సులభం. భర్త ఉంటే ఆయన్ని ఎంత ప్రేమించి, ఎంత త్యాగం చేస్తే స్త్రీని అంత మెచ్చుకుంటారు. ప్రేమా, త్యాగమూ కాక ధనమూ, నగలూ స్వంత సౌఖ్యమూ చూచుకునే స్త్రీని మెచ్చరు. మరీ భర్త లేని స్త్రీ తన హృదయంలో పొంగే ప్రేమని ఏం జేస్తుంది ? యెవరిమీదనో చూపుతుంది. భర్త పోవడంతో ఆమె ప్రేమకూడా చావదు. ప్రేమగల హృదయమూ ఉండాలి. ఆ ప్రేమ ఎవరిమీదా చూపనూ కూడదు అంటారు! అగ్ని వంట చెయ్యాలి, చెయ్యి కాలకూడదు అన్నట్లుంది.

భర్త ఐనవాణ్ని, ఎటువంటివాడయినా, ఏమి చేసినా ప్రేమించాలని శాస్త్రాలు విధిస్తున్నాయే, అలానే అనసూయ డాక్టర్ని అతను ఎటువంటివాడైనా సరే, ఏమి చేసినా సరే, పెళ్ళికానీ, కాకపోనీ ప్రేమించింది సావిత్రి లాగు.

అత్తిల్లు

"ఇంత చిన్నవాడివి నీకు అప్పుడే బైస్కిలు బండి యెందుకురా ?"

"నా కంటే చిన్నవాళ్ళందరూ యెక్కుతున్నారు. నాకు సిగ్గుగా వుంది. బడి యెంతో దూరం. ఎండలో నడవలేక నడవలేక ఆలస్యంగా చేరుకుంటే పంతులు కోప్పడుతున్నారు. నీకేం ? యింట్లో కూచునే దానికి నీకేం తెలుస్తుంది నా కష్టం."

"నన్నడుగుతావేం ? తాతయ్యనడుగు".

"తాతయ్యకేం తెలుసు? నీదా, తాతయ్యదా ఆస్తి ?"

"మంచివాడివే ! చూద్దాంలే, పంటలు రానీ !"

"ఏదడిగినా చూద్దాం, పంటలు రానీ అంటావు. నేను మా నాన్న దగ్గిరే వుంటే నాకు ఎప్పుడో కొనిపెట్టేవాడు. ఒక సైకిలు కొనిపెట్టలేని పెంపకం ఎందుకు చేసు కోవాలి ?"

"ఇలా అడిగేవాళ్ళు ఎవరూ లేరని, ఈపాటికి వూరుకో. ఎవరన్నా వింటారు !"

అని తను పెంచుకున్న కొడుకు సూర్యనారాయణ దగ్గర్నించి లేచి వెళ్ళిపోవాలని చూసింది అనుసూయ. వాడికి పదిహేనేళ్ళు. సెకండ్‌ఫారం చదువుతున్నాడు.

"ఎవరు వింటేనేం ? నాకు సైకిలు కొనిపెట్టకపోతే నేను మా వాళ్ళింటికి పారిపోతాను."

"కొంచెం పెద్దవాడివి కావాలి నువ్వు. దానిమీద నుంచి పడి కాళ్లూ చేతులూ విరుచుకుంటే ?"

"ఏమీ విరుచుకోను. ఎక్కేవాళ్ళందరూనో ! నీ డాక్టరుతప్ప ఇంకెవ్వరూ సైకిలు ఎక్కకూడదనా ?"

"నా డాక్ట రెవ్వర్రా మరీ మాటలు మీరుతున్నావు !"

"యెవరికి తెలీదనీ ! పరాయి మగాడితో నీకా మాటలెందుకు ? నా తల్లి ఇట్లాంటిదంటే నాకెంత తలవొంపులుగా వుంటుంది. నేను ఒప్పుకోను ఇట్లాంటి సంగతులు. నాయనమ్మ మంచినీళ్ళ చెంబు ఇంటిలోకి తీసికెళ్ళినప్పుడు, నీతో ఏమిటి, వినపడకుండా అంటున్నాడు ? వాణ్ణి, వాడి దొరటోపీని చూస్తే నాకు ఒళ్ళుమంట. మనింటికి రాజూ ఎందుకొస్తాడో ఎవరికి తెలీదని ? నువ్వు జాగ్రత్తగా వుండాలి. వాడెవడో మంచివాడనుకుంటున్నావు. ఏ బోగం వీధుల్లో చూసినా వాడే !"

"నీ కెందుకు ఈ సంగతులు ?"

"అవును, నాకెందుకు నీకు కావాలిగానీ !"

"నాతో మాట్లాడకు అవతలికి పో"

కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అనుసూయ గూట్లో అలానే కూచుని వుంది.

తల వెంట్రుకల సంగతి వాళ్ళవాళ్ళతో ప్రకాశరావు ఒకసారిగావును ప్రస్తావించాడు. కాని అతనేం సహాయం చెయ్యలేదు. చెయ్యలేదని కూడా అనుసూయకి తెలుసు.

అవాళ రాత్రి పదకొండింటికి ఆస్పత్రి వరండాలో ప్రకాశరావూ, అనుసూయ నుంచుని వున్నారు.

"నిన్న ఎవరన్నా అనుమానపడ్డారా ?"

"లేదు, కాని సూర్యనారాయణకి యేదో అనుమానంగా ఉన్నట్టుంది."

"వాణ్ని చూస్తే నాకు అరికాలుమంట నెత్తికొస్తుంది. మంచి కొడుకుని సంపాదించావు !"

"వాడి సంగతి పోనీద్దురూ. చిన్న వెధవ, వాడికేం తెలుసు ?"

"వాడికంటే నువ్వింత పెద్దదానివి ?" అని నవ్వాడు.

"వెన్నెల అందరూ బావుంటుందంటారు, నాకూ బావుంటుందిగాని ఆ గొప్ప అందమేమిటో తెలీదు."

"నాకుమాత్రం యీ వెన్నెల మీద చాలా కోపంగా వుంది. ప్రస్తుతం చీకటిగా వుంటే... ..... నిన్నీపాటికి యిట్లాయిట్లా పట్టుకుని..."

"మరి వెన్నెట్లోకి జరుగుతున్నారు. జరగండి కొంచెం లోపలికి."

"ఏమిటా జాగ్రత్త.... చలిపోయిందా?, ఇంకా కోటులోకిరా, ఇలా నుంచో, యెదురుగా, దగ్గిరిగా..... ఏమిటి ? ఏదో కొత్త నగలు వేశావు మెళ్ళో? గడియారం గొలుసే? ఇలా వెన్నెట్లోకి రా ! చూడనీ.... పరవాలేదులెద్దూ.... యెవరు చూస్తారు? మర్యాదా, హెూదా, యెక్కువైనట్లుంది. పెద్దకుటుంబానికి యజమానురాలవైనావు. కొడుకూ... కోడలు... ఇంతా చేస్తే నా భుజంయెత్తు లేవు యీ నున్నటి వంటిమీద యెట్లా మెరుస్తుందో, గొలుసు చివర లాగనీ - ఈ బిళ్ళేమిటి కళావరు.... ముద్దుపెట్టుకోనా ! యే సుందర ప్రదేశాల్లో దాక్కుందో ఇంతసేపు ! ఇంత చలిలోకూడా వెచ్చగా వుంది ఎంత మంచి వాసన సబ్బు, అందుకనే వితంతువులని అన్ని కట్టుదిట్టాల్లో పెట్టారు."

"ఇంగ్లీషు డాక్టర్లు అవన్నీ తొలగిస్తున్నారుగా"

"ఇవన్నీ కూడా తొలగిస్తారు."

ఆమె గొలుసును ఎప్పటివలె సర్దాడు.

"నా కంటే ఆ బిళ్ళే అదృష్టమైనది" అన్నాడు.

"యేమీ ?"

"నే నెన్నడూ చూడని స్థలాలన్నీ తిరుగుతోంది యెప్పుడూ !"

ఆమె భుజంచుట్టూ చెయ్యేసి, దగ్గిరిగా నుంచుని కళ్ళు మూసుకున్నాడు.

"ఎందుకలా అనుకుంటావు నా మీద ?"

"అన్నీ అలానే అనుకుంటారు మీరు, యిందాకా చలివేసేనా ఏం మీరు.....?"

ఇద్దరూ నవ్వారు !

"యీ కోటు యింత పొడుగేం ? ఇద్దరం దీంటో దూరవచ్చు, ఈ పెద్ద జేబుల్లో ఏముంటాయి ? ఈ సిగరెట్టుముక్క లెందుకుదాచుకున్నావు? యీ కాయితం, ఈ గొజుగొట్టం ఇవన్నీ ఏమిటి ? చిన్నపిల్లాడిలాగు ఇవన్నీ ఏమిటి ? చిన్నపిల్లాడి లాగు ఇవన్నీ దాచుకుంటున్నావా ? మళ్ళీ తెల్లారితే గొప్ప డాక్టరుగారు. కలెక్టరుకి జబ్బు చేసినా ఈయనే వెళ్ళి చూడడం."

"పద్దెనిమిదేళ్ళ మొద్దు నీకు చిన్న పిల్లవాడు కాగాలేనిది నేను కాకూడదా ఏమిటి ? పోనీ నన్నే పెంచుకోకపోయినావా వాడిబదులు. పెంపకం చేస్తున్నారంటే ఏం చంటిపిల్లవాణ్నే అనుకున్నాను. ఇంత చిన్న పాపాయిని పెంచుకుంటున్నారని తెలిస్తే, అంతకంటే చిన్న వాణ్ణి నేనని పెంపకమౌదును. అప్పుడు హాయిగా 'అమ్మా, అమ్మా' అనుకుంటూ రాత్రింబవళ్ళు నిన్ను పట్టుకుని....."

అనుసూయ అతని నోరు మూసింది.

"అలాంటి మాటలంటే నేను రాను మరి"

"రావూ ? వొస్తావు !"

"అవును ఏం, తెలీని దాన్ని, పిచ్చిదాన్ని చేసి....."

ప్రకాశరావు ఏదో ఆలోచిస్తున్నాడు.

"యింక వెడతా, యెవరన్నా లేచారేమో !"

"అప్పుడే వొద్దు."

"నిన్న చందమామ ఆ పెద్దకొమ్మ చివర వున్నాడు యీవాళ నెత్తిమీద కొచ్చాడు అప్పుడే ! చూడండి."

"చాలా బాగా తెలుసే నీకు టైము కనుక్కోడం ! వాచీ చూడు - ఇదిగో - పన్నెండు కాలేదు.

"మీ వాచీలో ఎంతైతే నాకేం ? తిప్పుతారు మీరు, సామాన్యులా ! నా చందమామ చూడండి."

"శనివారం రాత్రి మళ్ళీ యిక్కడే. మళ్ళీ చెప్పలేదనుకోకు, వీలు వుంది. మొన్నటి ఆదివారం చేసినట్లు చేశావా చచ్చిపోతాను. అలవాటై పోయినావు నాకు ! ఎప్పుడన్నా దీనికి అంతమే ఉంటే, ఎలా బతుకుతానో తెలీదు."

అనుసూయ అతని కోటుమీద చెంపల నానించి, పరిగెత్తు కెళ్ళింది.

ఆమె పరిగెత్తడం చూస్తే ప్రకాశరావుకి చాలా ఇష్టం. అంతసేపు ఆమె అందం చూడనట్టే తోచి 'అనుసూయ' అని కేకేశాడు. ఆమె తీగలదగ్గిర నీడలో ఆగి వెనక్కి చూసింది. మళ్ళీ అతని దగ్గిరికి వెన్నెట్లో వెడుతూ, యెవరన్నా చూస్తారని భయపడి చీకటిలోకి వెళ్ళమని సంజ్ఞ చేసింది. ప్రకాశరావు రెండు నిమిషాలు నుంచుని యింటివేపు నడిచాడు.

ఇన్నాళ్ళు ఇంత స్నేహం చేసినా, తనకి స్వాధీనంకాక అనుసూయ తిప్పలు పెడుతోందని అతనికి విసుకుగా వుంది. ఎక్కువ చనువు తీసుకుంటే తరువాత పదిరోజులు రావడం మానేస్తుంది. కాని అతనికీ రాత్రులిట్లా అనుసూయతో తమాషాగా గడపడం చాలా ఆనందగా వుంది.

అనుసూయ తీగెలుదూకి, తలవొంచుకుని వంటింటి తలుపుతీసి లోపలికి వెళ్ళి గడియవేసి చావిట్లో మంచంమీద కూచుంది. గోడకి దీపం బుడ్డి వెలుగుతోంది. మామ, అత్తా ఇద్దరూ పక్కగదిలో గురకపందాలేసుకుంటున్నారు. సూర్యనారాయణ వూళ్ళో స్నేహితులతో చదువుకుని అక్కడే పడుకుంటున్నాడు. అనుభవించిన 'ఎక్సైట్‌మెంట్' వల్ల నిద్ర రావడంలేదు. ఇంకా ప్రకాశరావుతో బైట ఉండిపోవాలనిపిస్తోంది. మళ్ళీ వెడితే వుంటాడా

? వృధాగా తొందరపడి వచ్చేశాననుకుని, మళ్ళీ లేచి చప్పుడు కాకుండా దొడ్లోకి వెళ్ళింది. గేటు దాటుతున్న ప్రకాశరావు కనపడ్డాడు. 'ఏమండీ' అని కొంచెం బిగ్గిరిగా కేకేసింది. అతను వెళ్ళిపోయినాడు. వినపడలేదో, ఏమో?

అప్పుడే యెందకు వెళ్ళిపోవాలి ? నేను మళ్ళీ వస్తానేమో అనుకోకూడదూ ? అని కోపం తెచ్చుకుంది. వెన్నెలవంక చూస్తూ ఆ విశాల శాంతసముద్రం మధ్య నుంచుంది. పారిజాతం పువ్వులు నాలుగేరి తలలో పెట్టువుంది. ఇటూ అటూ తిరిగింది. బాదంచెట్టు నీడకిద బావివెనుక చూసేప్పటికి దొంగలు జ్ఞాపకంవొచ్చి, మెళ్ళో గొలుసుతీసి జాసుకుంది. దాన్ని బావుందన్నాడు కదూ? ఆ బిళ్ళ యేం వాసనేసింది? వాసేం కనపట్టంలేదే. దాన్ని ముద్దు పెట్టుకుని దీర్ఘ నిశ్వాసం విడిచింది. తన మెడమీద యెంతో అందంగా వుందన్నాడు ఆ గొలుసు. ఎలా కనపడి వుంటుంది ? ఇంటిలోకి వెళ్ళి అద్దం తీసుకుని మంచంమీద కూచుంది. దీపం అద్దంమీద పడేటట్లు. మొహం చీకటిగా వుందే? ఇటు తిరిగి అటు తిరిగి మొహం కనపడేట్టు చేసింది. తనకళ్ళు సీతామహాలక్ష్మి కళ్ళలాగుండ కూడదూ ? పెద్దగా కోలగా జుట్టువిప్పి మొహంమీదికి లాక్కుని చూసుకుంది. ఇప్పుడతను తననిచూస్తే శనివారం రాత్రి జుట్టిట్టా పెట్టుకుని వెళ్ళాలి. చూడగానే ఆ అందం ఆశ్చర్య పోతాడు. కళ్ళు కొంచెం పెద్దగా కనపడేట్టు కాటిక పెట్టుకోడానికి వీలైతే. అత్త బొట్టుపెట్టెలోని కాటిక పెట్టుకుని వెడితే ! తెల్లరి వాళ్ళు లేవకముందే కడిగేసుకోలేనూ ? అయినా వెన్నెట్లో కాటిక కనపడుతుందా అతనికి ?

ఏమీ తోచదు. నిద్రరాదు, ఏదో చెయ్యాలనిపిస్తోంది. ఏమి చెయ్యాలో తెలీదు. వెన్నెలకేసి చూస్తుంది. చూసున్న కొద్దీ బాధ. కాని ఆ వెన్నెలనీ, బాధనీ వొదలలేదు. యవ్వనంలో ఆ బాధ ఎంతో దుస్సహమనిపిస్తుంది, యవ్వనం పోయిం తరువాత ఆ బాధలేదే అని యేడుస్తారు.

అనుసూయ మర్నాడు పొద్దున్న ఎనిమిదింటికి లేచింది.

"మరీ యీ అమ్మ యింత పొద్దెక్కి లేస్తుందేం ? రాత్రంతా యేం చేస్తుంది ? పరీక్షలా ? చదువా ? ఆ డాక్టరుగాణ్ని తలుచుకుంటూ జాగారం చేస్తుంది గావును !" అంటున్నాడు సూర్యనారాయణ, ఫస్టుఫారం జయించిన వస్తాదు.

* * *

నీతివేత్తలు, మనుషులకి ముఖ్యంగా స్త్రీలకి శరీరము వుందని మరిచిపోతారు. కొన్ని పరిస్థితులలో నరాలు ఉద్రేకంతో నిండి బాధపడతాయి. ఎంత ప్రయత్నించినా అవి శాంతించవు. మనోబలమూ, యింద్రియ నిగ్రహమూ బోధిస్తారు. కాలునరం లాగేప్పుడుగాని, తలనెప్పి వచ్చినప్పుడు కాని ఆ యింద్రియ నిగ్రహం నీతివేత్తలకి ఎంత వరకు సహాయ పడుతుందో! సాధారణంగా యీ నీతివిశారదులకు కామబలం తక్కువ. వెన్నెలవల్లనూ, పువ్వులవల్లనూ వారికి ఏ మాత్రమూ అశాంతి గాని, బాధగాని కలగదు. రక్తాన్ని వుడికెత్తించి,

అర్థంకాని వేదనతో, తపనపెట్టే మహారసికత్వం వారిని పట్టదు. అజీర్ణ వ్యాధితో బాధపడేవారు తిండిపోతుల్ని ఎట్లా వెక్కిరిస్తారో, నైతికాధికారులూ, సంఘాధికారూల ఆ విధంగానే యవ్వన జ్వరంతో బాధపడే వాళ్ళని దండిస్తారు.

పుట్టిల్లు

మొన్న సూర్యనారాయణ పెద్ద తగూ పెట్టాడు. వాడి పక్షం అత్తా, మామా కూడా అందుకున్నారు. సూర్యనారాయణ తనకి తలనెప్పిగా వుందంటే, వాళ్ళ బళ్ళో కుర్రాడు -

"నీకేంరా ? డాక్టరు నాన్నగారుండగా తలనెప్పికి మందే దొరకలేదా ?" అని.....

యింకోడితో "అదృష్టమంటే వీడిదిరా..... వీణ్నికన్న తల్లీ తండ్రీ వుండగా అందమైనతల్లీ, డాక్టరు తండ్రీ దొరికారు. ఆస్తి సరేకద ! వీడికింక చదువెందుకు" అని అన్నాట్ట ?

ఆ మాటలతో సూర్యనారాయణ ఏడ్చి యిల్లంతా గోలచేశాడు. ముసలివాళ్ళకి అనుసూయ చేస్తున్నదేమీ తెలీదుగాని, ఆ నిందకి ఆమె బాధ్యురాలైనట్టు వాణ్ని వెనకేసు కొచ్చారు.

"మనకి తెలీకండా వాణ్నెక్కడ కలుసుకుటోందో?" అన్నాడు కూడాను! సూర్యా నారాయణ. కోపమొచ్చి అమ్మా వాళ్ళింటికి వొచ్చేసింది అనుసూయ.

అమావాస్య రాత్రి అమ్మ ముట్టయింది. అమ్మ ఆ అరుగుమీద పడుకుంటో యీ అరుగుమీద అనుసూయ పడుకుంది. ఈసారి వొచ్చినప్పణ్నించి మా మామయ్య సీతారామయ్య తరహా ఒక మోస్తరుగా వుంది. తనలో ఏదో కొత్త మార్పుచూసి విభ్రాంతుడైనట్టు చూస్తున్నాడు తనని. కొంచెం పెద్దదాన్నివలె గౌరవం చేస్తున్నాడు, పెంపకమయిందనేమో ! మళ్ళీ సూర్యనారాయణ సంగతి విని బాగాతిట్టాడు వాణ్ని. డాక్టరు సంగతంతా వాడు కల్పించిందే అన్నాడు. అతనూ అత్తా ఆ గదిలో పడుకుంటారు. ఎండాకాలమైనా అత్తని బైటపడుకోనీడు. ఎంత వుక్కగా వుందో.... ఈవాళ ఈ వుక్కలో గదిలో యెట్లా నిద్రపడుతోందో ఈ దోమల్లో ? నిన్న రాత్రి అత్తయ్య అర్ధరాత్రి తన పక్కలో పడుకుంటేలేపుకువెళ్ళాడు. ఇంకా నిద్ర పట్టదు !

ప్రకాశరావుదగ్గిరికి ఆస్పత్రికి వెళ్ళాలని వుంది. వెన్నెల పోయింది. చీకట్లో భయంలేకుండా అతని భుజంమీద చెయ్యేసి చెంప ఆనిస్తో తిరగవొచ్చు. కింద తేళ్ళూ పాములూ వుంటాయని భయం, తనకి కూడా బూడ్సు లుంటే యెంత బాగుంటుంది ! ఏం చేస్తున్నాడో ప్రకాశరావు ? అతని యిల్లెట్లా వుంటుందో !

మళ్ళీ ఆదివారం రాత్రి వొస్తానంది ఆస్పత్రికి. ఆ లోపున వెళ్ళాలి అత్తగారింటికి. కాని ఆ వెధవ సూర్యనారాయణ ! వాణ్ని బాగా తంతే.

నిద్రపట్టింది. ఎవరో లేపుతున్నారు. ఎందుకు ? వుందూ, అబ్బా ! ఇంకా చెయ్యిపట్టుకుని కదిలిస్తున్నాడు.ఎందుకబ్బా ? లేచింది. పక్కలో యెవరు అత్తయ్యా. మాట మాట్లాడరు యెవరో ? లేచిరమ్మని చెయ్యి పట్టుకుని లాగుతున్నారు. ఈ అత్తయ్యా మళ్ళీవొచ్చి పడుకుందిగావును. లేవదీసి తనని యెక్కడికో తీసుకుపోతున్నారు. గది గుమ్మం కాళ్ళకి తగిలింది. పడతా ? యెందుకట్లా గట్టిగాపట్టుకుంటారు ? ఎవరు ? నెప్పి వొదులు అక్కడ పట్టుకోక, ఎవరు ? కళ్ళు తెరిచింది. కటిక చీకటి యెవరో చెప్పు. చెపితేగాని రాని. నేనూ? నేనంటే?..... యెవరు? మామయ్యా..... నువ్వు ! యెందుకు?..... రాను.... ఆ గదిలోకి యెందుకు?...... లాగకు..... ఏమిటిది తగుల్తోంది.... మంచం..... తొయ్యకు నన్ను.... నిద్ర వొదలటం లేదు. అరిస్తే వొదులు తాడేమో?

"అమ్మా, అమ్మా,"

మామయ్య అంటున్నాడు. "మీ అత్తయ్య అనుకున్నాను నిన్ను - చీకట్లో ఎంత పొరపాటు ! యెవరితో చెప్పకేం, నిన్ను చూసి నలుగురూ నవ్వుతారు. అమ్మతోనైనా చెప్పకు. చెప్పవుకద? చెప్పనను వొదుల్తా ?"

"సరేలే !"

అత్తిల్లు

ఎప్పుడన్నా నాకు బదలాయింపై వెళ్ళిపోతే నువ్వే మౌతావు?

"ఏమీకాను, ఏమౌతాను! ఏమో, ఏమౌతానో !"

"నీకు దిగులెయ్యదూ ?"

"నా ఖర్మం - ఏం చేస్తాను."

"ఇవాళంతా ఏం చేస్తున్నావు. మధ్యాహ్నం యింటికొస్తే కనపడలేదేం దొరసానిగారు."

"మిమ్మల్ని వాళ్ళందర్లోనూ చూడడం భయంగా వుంది. నా మొహంలో సంతోషం, నా కళ్ళల్లో ప్రేమా అందరికీ కనపడుతున్నట్టున్నాయి."

"ఏదీ, నన్ను చూడనీ కనబడుతున్నాయేమో !"

"మీకు కనపడవు. వాటిని యెక్కడ కనపడ్డా చంపేందుకు వెతికే వాళ్ళకి మాత్రం కనపడతాయి."

"ఎవరన్నా ఏమన్నా అన్నారా".

"సూర్యనారాయణ ముఖ్యం. మొన్న 'అమ్మ యెప్పుడో అప్పుడు డాక్టరుతో లేచిపోయేదే !' అన్నాడు అందరి ముందరాను !"

"ఏం చెయ్యను. మొన్న రాత్రి తలుపుచాటున దాక్కున్నాడు నేనెక్కడి కన్నా వెడతానేమో చూడ్డానికి"

"మనం యిక్కడ కలుసుకోడం అట్టే మంచిదనుకోను."

"చూడనీండి. చూస్తే చూశారు. చూడనీండి"

"భయం లేదూ ! వూరుకుంటారా."

"ఏమో ఏం చేస్తారో చెయ్యనీండి."

"నాకు మాత్రం నలుగురి నోళ్ళలోనూ పడడం యిష్టంలేదు."

"ఎందకు భయం. మనం ఏం చేస్తున్నాం ? రాత్రివెన్నెల్లో కొంచెంసేపు మాట్లాడుకోడం మహాతప్పా !

"వాళ్ళంతే అంటారా ! ఈ వాదనెందుకుగాని యిట్లా కూచో. మంచుతో తడిసింది. ఇక్కడ వుంటే యెప్పుడో ఒకప్పుడు యెవరో ఒకరు చూసే మాట నిజమే. లోపల కూచుందాం, కుర్చీలున్నాయి ! తలుపు తీసి వుందేమో చూస్తాను."

ఆడది భయపడ్డంతసేపే మొగవాడి ధైర్యం.

"నేను లోపలికి రాను."

"ఎన్నాళ్ళు మొండితనం !"

"నేను రాను. తప్పు !"

ప్రకాశరావు నవ్వాడు.

"ఇది తప్పుకాదూ ! యిట్టారా."

"చీకటీ, వొంటరితనమూ, అసహాయ ఐన బాలిక తన చేతుల్లో వుండడమూ, ప్రకాశరావు రక్తాన్ని వేడెక్కించాయి. ఈ పిల్ల యిన్నాళ్ళు తన నెట్లా తప్పించుకుంటోంది ! తన అశ్రద్ధచేతనే ! తన నెమ్మదితనం వల్లనే. ఇట్లా తను తాత్సారం చేస్తే యింకెవరో తీసుకుంటారు. దగ్గిరిచేరి శరీరాన్ని వొత్తుగా ఆనించి చేతులతో, అంతా స్పృశిస్తో ఆమె నుద్రేకింపచేయ ప్రయత్నించాడు. అనుసూయ పులి వాసనతగిలిన లేడిపిల్లవలె అదిరిపిడి లేచింది, అతనూ లేచి "రా, అనుసూయా, నన్నేడిపించకు. నీకు తెలుసును నేను నీకు కావాలని. చూడు-నీ కళ్ళల్లో సిగ్గు చెప్పడంలేదూ" అన్నాడు వేడిగా.

అనుసూయ, ప్రయత్నంమీద బలం తెచ్చుకుంది. అతన్ని తోసేసి అరుగుమీదనించి కిందికి దిగింది. ప్రకాశరావు ఆమెని యేమైనా ఒదలతలచుకోలేదు. కిందినించి పైకి లాగేశాడు.

".......నిన్ను ఒదలను.... ఇంక యిట్లాయితే నేను రాను."

చూడు ఎందుకు నీకా భయం ! నేను డాక్టర్ని. భారం అంతా నామీద వెయ్యి, ఒకసారి......"

అనుసూయకి పెద్ద భయం పట్టుకుంద, ఏం చెయ్యాలి ! మళ్ళీ ఒదిలించుకుని యింటికేసి చూసింది.

"పోనీండి రాకపోతే పోయినారు, నేనుండను. నన్నట్లా ముట్టుకోవద్దు. వుండండి యెవరో వస్తున్నారు."

ఒదిలించుకుని ఒక్కపరుగు తీసింది. వెనక డాక్టరు రోజుతూ వెళ్ళాడు. తీగెలు దూకేస్తోవుంటే, చెరుగు పట్టుకున్నాడు. చీరె సర్రుమని చిరిగి డాక్టరు వెనక్కి కూల పడ్డాడు. వెనక్కి తిరిగిచూసి నవ్వు ఆపుకోలేక నవ్వి పారిపోయింది.

ప్రకాశరావుకి చాలా కోపం వచ్చింది. ఆమెని యింకెప్పుడూ చూడకూడదని నిశ్చయించుకున్నాడు. పది రోజుల గడిచాయి.

అతను అనుసూయగారి యింటికన్నా వెళ్ళలేదు. బాధగా వుంది అనుసూయని చూడకపోవడం. ప్రేమకన్నా కోపం యెక్కువగా వుంది మరి. తనకి దొరక్కపోవడం - అనుసూయ ఆ తెలివితక్కువ పిల్ల తన వాంఛని ధిక్కరిస్తుందా ? లోబరుచుకుని, ఆ అల్లరి కంఠంలోంచి జాలి ఒలికే ప్రేమ శబ్దాలు రప్పించాలి. ఇంక శక్తిలేక తన పాదాలదగ్గర పడిపోవాలి ఆమె.

అనుసూయ మాత్రం డాక్టర్ని యింక యెన్నటికీ చూడకూడదని నిశ్చయించుకుంది. తరతరాలనించి వస్తున్న గుణాలు, మనుషులు మృగ స్థితిలో వున్ననాటి లజ్జా, బెట్టూ, నిగ్రహమూ, ఇంకా మనుషుల్లో పూర్వం నించి వస్తున్న పాపమంటే భయమూ, లోబడితే నాశనమవుతాయనే నిశ్చయమూ యివ్వన్నీ ఆమెకీ తెలీకండా, ఆమెని కాపాడుతున్నాయి.

కాని విధి వేరే విధంగా తలిచింది. ఆమెని నీతిలో వుంచాలని తంటాలు పడే ఆమె మనుషులే ఆమెని డాక్టరు చేతుల్లోకి నెట్టారు.

వ్యభిచారాల్లోకీ, వైరాగ్యాల్లోకీ కూడా బలవంతాన మనుషుల్ని నెట్టేది ఆప్తులే. వారి బుద్ధిహీనత్వంవల్లా, క్రూరత్వంవల్లా.

అనుసూయ జుట్టు తీయించడానికి ముహూర్తం నిశ్చయమయింది.

డాక్టర్ని కలుసుకోకూడదనుకుంది. కాని ఈ ఆపదలో ఎవరు దిక్కు !

అత్తిల్లు

"బలవంతంగా లాక్కెడతారట. ఎల్లుండే ? ఏం చెయ్యనండి ! తరువాత యెట్లా బతకను ! ఎవరిముందైనా నా మొహం యెట్లా చూపించను. మళ్ళీ మీ దగ్గిరికీ యెట్లా రాను ! ఎట్లా ! మీరేదో సహాయం చేస్తామన్నారు. ఏం చేస్తారిప్పుడు ! చెప్పండి.... ముందు చెప్పండి.... తరవాత నేను బతకను. ఎట్లానూ చచ్చిపోతా.... రేపే.... అట్లా అనకండి.... మీకు తెలీదు. నేను చూడలా! బలవంతం చేస్తారు.... లోకమంతా హర్షిస్తుంది. పైగా వాళ్ళకే సహాయపడతారు. నేను చూడలా ! వాళ్ళ గరిమెళ్ళవారి అమ్మాయినేం చేశారు ?

ఏడుస్తో అరుస్తో తన్ను కుంటున్నదాన్ని రోడ్డంబడి మంచంలో వేసి కట్టుకుపోయి తీసేశారు. నాకు భయమేస్తోంది. మా మామయ్య కూడా వాళ్ళవేపే ఐనాడు. నేను రేపు చచ్చిపోతా. మీరేమన్నా మందిచ్చి మీ చేత్తోనే చంపండి."

అని అనుసూయ ఆ రాత్రి ప్రకాశరావు కంఠం కావిలించుకొని యేడ్చింది. అతనేనేవో చెప్పి వోదార్చాలని చూశాడు. కాని ఆమెకి విశ్వాసం కలిగించలేక పోయినాడు.

"ఇప్పుడిట్లా యెందుకు నిశ్చయించారు వున్నట్లు వుండి ?"

"ఆ సూర్యనారాయణ వెధవ వాడే ! వాణ్ణొక్కసారి తన్నలేరూ మీరు ! మీకు, నాకు సంబంధం వున్నదని ఒకటే వాగుడు ప్రతిచోటా; పొద్దున్న లేస్తే అదే పని వాడికి.

"అమ్మ ఎప్పుడో ఆ డాక్టరు వెధవతో లేచిపోయేదే. కాని....."

అంటోవుంటాడు. వాళ్ళకి అనుమానం తోచింది. ఊళ్ళో అంతా అంటున్నారట. ఏమేమిటో ! వాడి స్కూలు పిల్లలు యేదో అన్నారుట వాణ్ణి. ఒకటే తిట్టాడు నన్ను ఆ సాయంత్రం. అందరినోళ్లా ముయ్యాలని యీ పనికి నిశ్చయించుకున్నారు.

ఈ రాత్రి దొడ్డిదగ్గిర కావలి కూచున్నాడు వాడు. రహస్యంగా, వాణ్ణి బైట పెట్టి తలుపేశాను. నిద్ర ఆపుకోలేక పోయినాడు గావును.

అబ్బా చాలా తల నెప్పిగా వుందండీ వాడిసంగతి చూస్తే ! ఎందకు నన్నిట్లా ఏడిపిస్తాడు ! లోకమంతా నన్నెందుకిట్లా యేడిపిస్తుంది. నా సంగతి వాళ్ళకెందుకు. నేనేమన్నా వాళ్ళ జోలికి వెళ్ళి, వాళ్ళని అల్లరిపెట్టానా ? వీణ్ణొక్కణ్ణి నా కెందుకు కట్టిపెట్టారో ! - వీళ్ళందరిని, బంధువుల్ని లోకాన్ని వదిలేసి యెక్కడికన్నా వెళ్ళిపోయే వీలేవుంటే.....

"నన్నూ -"

"మిమ్మల్నీని, మొగవారు మిమ్మల్ని నమ్మాను. ఏమీ సహాయం చెయ్యలేరూ ! మీ ప్రేమ లేకుండా మిమ్మన్నిట్లా కలుసుకోకుండా బతకడం యెట్లా ?"

అతని భుజంమీద వేళ్ళాడుతో యేడుస్తోంది. అతనికీ వోదార్చే మార్గం తెలీలేదు. చుట్టూ మెల్లిగా చేతులుపోనిచ్చి ముందుకు లాక్కున్నాడు. మొహం యెత్తి ముద్దు పెట్టుకుని, ఆమెని గట్టిగా అదిమి మెల్లిగా గదివేపు తీసికెళ్ళాడు. మొగాడికి ఆడదాన్ని వోదార్చే మార్గం అదొక్కటే తెలుసు.

'పాపం, యెన్నికష్టాలో నీకు, నేనున్నానుగా, నేనుండగా యెవరేం చేస్తారు? నిన్నిట్టా పట్టుకుంటే యెవరొస్తారో రమ్మను, ఈ బాధలన్నీ పోగొడతాగా. అన్నీ మరచి పోయ్యేట్టు చెయ్యనా ?'

ఇంటి దగ్గిర ఆ ముసలివాళ్ళతో పడివుండడం, తన పెంపుడుకొడుకు తన ప్రాణాలు కొరుక్కుతినడం, వాడి అనుమానాలకీ, అసహ్యపు మాటలకి తను పడవలసి రావడం, యెవరు చూస్తారో అనే భయంతో తను ప్రతిరోజూ మాయోపాయాలు పన్నడం, తల

వెంట్రుకలు తీసేస్తారని యీ అల్లరీ, భయమూ. తన నిర్మలమైన ప్రేమకి యీ విఘాతాలూ, యివన్నీ జ్ఞాపకంవొచ్చి విసుకూ, అలసటా కలిగాయి. యిదివరకంతా తల్లిమీద ప్రేమ రక్షరేకుగా వుంది. కాని తన వెంట్రుకలు తీయించవొద్దని యెంత యేడ్చినా ఆ తల్లి విన్నదికాదు. పైగా తాను ప్రకాశరావుని చూడడం మానుకున్నా, వాళ్ళ అనుమానాలు మానలేదు. ప్రజలు వాళ్ళకి తనకంటే యెక్కువైనారు. అంత నిర్దయగా చూసే తల్లిమీద తనకి మాత్రం యెందుకు ప్రేమవుండాలి ?

ప్రకాశరావు లోపలికి తీసుకుపోతో వుంటే వూరుకుంది. అతనితో పోట్లాడానికి ఉత్సాహమూ శక్తీ లేవు.

గది లోపల పక్కమీద సగం వరకు వెన్నెల అందంగా పడుతోంది. అనసూయ పరుపుమీద చీకట్లో కూచుంది.

"ఇట్లా వెన్నెట్లోకి రా. దగ్గిరగా బావుండలా ? ఇట్లా వుండనీ. ఇన్నాళ్ళెందుకు భయపడ్డావు ? ఇంకా ఎందుకు ఆ చిన్న దుఃఖం ? వెన్నెల వేపు తిప్పు మొఖం. ఒకసారి నవ్వు, చిన్న నవ్వు చూపించూ. కోపమా నా మీద?"

"చక్కలిగిలి. వొద్దు, కొంచెం వుండండి !"

"ఇన్నాళ్ళు దాచేశావు నా దగ్గిర్నించి. వుండు ఒకసారి చూడనీ.... చీకట్లోకి వొంగకు. వొదులు".

మూలలు కనపడని గదీ. వుదయించే చంద్రుడి వెన్నెలా, వొంటరిగా పరపురుషుడితో దగ్గిరిగా వుండడం. చాలా కొత్తగా, వింతగా ఆకర్షించింది ఆమెని.

* * *

ఆ రాత్రి అనసూయకి కొత్త సిగ్గు వొచ్చింది. ప్రకాశరావువంక చూడదు. తల అవతలకి తిప్పేసికుంటుంది. మాట్లాడదు. ఆ వెన్నెల్లా, తన కంఠంలో నాడీ, హృదయమూ అన్నీ మాట్లాడుతో వుంటే, తను వేరే యెందకు మాట్లాడాలి? అలిసి సిగ్గుతో మూసుకుని వున్న కళ్ళని ముద్దు పెట్టుకున్నాడు. రెండు చేతులూ జాచి అతని తలని గట్టిగా కావిలించుకుని....

"నేను వెళ్ళను యింటికింక వెళ్ళను. నిన్ను వొదిలి"

"ఎందుకు వెళ్ళడం వుండిపో."

"తెల్లారినా....."

"తెల్లారిందాకా."

"అంతే ?"

"తరవాత ఎట్లా మరి !"

పుట్టిల్లు

పొద్దుణ్నించి అన్నం లేకపోవడం వల్ల అర్ధరాత్రైనా నిద్రరాదు. ఎలికలు మూలనించి మూలకి పరిగెత్తితే భయంగా వుంది. చీకట్లో కరుస్తాయేమో ! ఎంతసేపు చప్పట్లుకొడుతో కూచోగలను ? ఎన్నాళ్ళుంచుతారు తనని యీ గదిలో ? పొద్దున్న అత్తకొట్టిన దెబ్బలు యింకా మంట పుడుతున్నాయి. తనని కన్న అమ్మకంటే, మొగవాడు మామయ్య కంటే, యీ అత్తయ్యకి ఎందుకో కోపం? ఏమైనా తను డాక్టర్ని చూడకుండా మాన్తానని ఒప్పుకో కూడదు. పాపం ఆయన తనకోసం దిగు పెట్టుకోడూ. పోనీ, అమ్మా వాళ్లూ అపరిదిష్ట అంటారు గనక, తను వాళ్ళకోసం ప్రకాశరావుని ఒదులుకోవచ్చు. కాని ఆయన తనని అంతగా ప్రేమించేట్టు చేసుకుని ఆయన్ని ఒదిలెయ్యడం ఆయన యడల న్యాయం కాదు. తను లేక ఒక్కడూ ఎట్లా గడుపుతాడు రాత్రులు ? వెన్నెలలో తడిసిన జుట్టుతో ఆడుకోడం, తనని వదలలేక తిరిగి చూస్తో వెళ్ళడం, తను రావడం, ఆలస్యమైతే ముళ్ళమీద వలె బాధపడడం, తన అందం చూసి కాంక్షించి అనుభవించడం అన్నీ తలచుకుని చేతుల్ని వుత్త రొమ్ముకి బిగించుకొని పెదవులు ముద్దు పెట్టుకున్నట్టుగా చేసి తన్మయత్వం చెందింది. తన రొమ్ముకి అట్లా అతన్ని సిగ్గుతో ఒత్తుకున్న నిమిషం, అప్పుడు ఒంట్లోంచి పరిగెత్తిన విద్యుచ్ఛక్తి స్ఫురణకి వొచ్చాయి.

ఎన్నాళ్ళు యిలా కట్టి పెడతారు ? ఒదలగానే ఆయన దగ్గిరికి వెళ్ళిపోవాలి. ఈ మూన్నాళ్లూ యేమనుకుంటున్నాడో ! యేం గోల పెడుతున్నాడో ! ఒక్క చీటీ పంపడానికన్నా వీలుంటే బాగుండును ! కబురన్నా పంపితే !..... యెట్లా ?

ఎన్ని దెబ్బలన్నా తినవచ్చు, ప్రేమకోసం తననుభవించిన సౌఖ్యములో ఈ బాధ ఎన్నో వంతు ! కాని దెబ్బలు తినడం అసహ్యం. తనని అవమాన పరిచినట్టు. మృగంతో సమానం చేసినట్టయింది. అందులో అత్త ! ఆ తాడుతో! ఏం అధికారం అత్తకి తన మీద ! అత్త తప్పు చేస్తే తనచేత దెబ్బలు తింటుందా? యింకోళ్ళని కొట్టడం యెంత అసహ్యం !

వాడు.... సూర్యనారాయణ కొట్టడానికి మీదపడ్డాడు. మామయ్య గట్టిగా లాగేస్తే గాని లొంగాడుకాడు, వాడి కెందుకో ఆ కోపం ? వాడి స్నేహితులు వెక్కిరిస్తారని, ఆ స్నేహితులకెందుకు ఆ కోపం ? తన సంగతి యీ లోకానికంతా ఎందుకు ? యింత కోపం ! దాసీది రత్తి అది రోజుకి ఒకడితో వుంటుంది. దానికెంత కోపం వచ్చింది ! తిట్టు కూడా తిట్టింది తనని ! దొంగతనాలూ అవీ చేస్తే యింత కోపము రాదే ! మనిషిని చంపినవాణ్ణి చూస్తే కొంత భయమూ, గౌరవమూ వుంటాయి. కాని యిట్లాటి స్త్రీ మీద మాత్రం.....

తనకి దిక్కు లేక పోబట్టే కదూ యింత దౌర్జన్యం ! ఒక్కరూ తనవేపు పలికేవారు.... ఒకవేళ ప్రకాశరావే, ఆ సమయాన అక్కడవుంటే తననిట్లా తిట్టేవారా ? అమ్మ జుట్టుపట్టుకు యీడ్చేదా ? యిప్పుడన్నా అతనికి తెలిస్తే వూరుకుంటాడా ? వీళ్ళందరినీ తన్ని తనని విడిపించడూ ! పాపం. వీళ్ళని అతను తన్నవొస్తే మామయ్యనీ, అమ్మనీ యేమీ చెయ్యవొద్దనాలి. మామయ్య తననేం చెయ్యలేదు. ఇంటికి మొగపెద్దయినా, అమ్మ తనని కన్నది. పెంచింది. యీ అత్తని, అతను, తనని అత్త కొట్టినట్టు కొడుతో వుంటే చూడాలని వుంది. మామయ్య వూరుకుంటాడా ? వూరుకోకపోతే, ఆయనకి కూడా తన్నులే ! తనని వొదిలిపెట్టగానే అతనికి తెలియచెయ్యాలి తనని గదిలో పెట్టడమంటే యేమిటో తెలుస్తుంది వీళ్ళకి. ఈ శిక్ష యెంత నీచం. రోజూ మొగుళ్ళతో సరసాలూ, అనుభవాలూ, మోహమూ తీర్చుకునే వాళ్ళు వీళ్ళా తనని శిక్షించడం! తను యెంతో ఆనందంగా యింకోరిని ప్రేమిస్తే, దాన్ని, ఆ అనుభవాన్ని యిట్లాంటి పాడు పేర్లతో పిలిస్తే తననీ తన ప్రియుణ్ణి యెంతో అనమానపరచినట్లయింది. యెంత అందంగా, బలంగా, ధైర్యంగా, ప్రేమమూర్తి వలె తన హృదయాన్ని యేలిన ఆ మహారాజునా, ఆ పాడు మాటలన్నీ వీళ్ళన్నది! ఒక్క మాటా జవాబు చెప్పకండా వూరుకోవలసి వొచ్చిందా ! తన చేతులు, వేళ్ళు, మొహం, యెంతో అందంగా అప్సరస వలె వున్నాయని మళ్ళీ మళ్ళీ ముద్దులు పెట్టుకున్నాడు. తన జుట్టుతో యేట్లా ఆడుకున్నాడు. ఆ జుట్టుని పట్టుకుని యీడ్చిండి అమ్మ. 'నెప్పో' అని యేడవడం, అతని చేతుల్లో ప్రేమతో నవ్విన తను యేడవడం యెంతో నీచమనిపించింది. మళ్ళీ ఆయన మొహ మెట్లా చూడడం ? లోకంలో తనూ మనిషినని యెట్లా తిరగడం? తన అనుభవం వున్నతమని, సుందరమని వీళ్ళకి అర్థం కాదా ? లేకపోతే, లోకభయం వల్ల యిట్లా దెయ్యాలవుతారా ? అస్వభావికము, పశుసమానము, ఘోరము, రాక్షసమైనవని చేసినట్టు చూశారు. అత్త రోజూ చేస్తున్న పనే, అమ్మ తనని కనడానికి పొందిన అనుభవమే ! పరాయి పురుషుడనా ? ప్రకాశరావు పరాయివాడనా ? వీళ్ళందరి కంటే తనకి ఆప్పుడు ఎవరో కొత్తవాడు. మామయ్య, అత్తయ్యకి తన బంధువులందరికంటే యెక్కువవాడు కాలేదూ? తనకి అట్లానే!

ఎవరు తలుపు తెరుస్తున్నారు ? అమ్మే బహుశా ! ఆకలిగా వుంది. అన్నం పెడతారా? దీపం లేదే ? ఎవరు ? దగ్గరికి వచ్చి కూచున్నారు. తినమని యింత పులిహోర ముందు పెట్టారు. ఎవరు ? మామయ్య లాగుంది. నోరుమంట పుట్టి మంచినీళ్ళడిగింది తెచ్చి యిచ్చాడు.

"పొద్దుణ్నించి నీ అవస్త చూస్తే దిగులేసింది నాకు. మరి నువ్వు చేసిన పనేమిటి చెప్పు ! ఈ సంబంధం మానుకోవాలి. అది మన కుల ప్రతిష్టకీ, మన కుటుంబం పరువుకీ తగిన పనికాదు. ఒప్పుకోవూ ?" మామయ్యని, నా కోసం ఒప్పుకోవూ ?

గడ్డం కింద చెయ్యేశాడు చీకట్లో వెతికి.

"నిన్న పొద్దున్న అత్తయ్య కొడుతో వుంటే నా కెట్లా వుందనుకున్నావు? నన్ను కొట్టినట్టయింది. చిన్నప్పణ్నించీ నీ మీద నా కెంతో ప్రేమ అని నీకు తెలుసు కదా ? నాతో యెందుకు చెప్పలా ముందే, యిట్లా మన ప్రతిష్ట పాడు చేసి, అన్యాయంగా దెబ్బలు తింటావా ? పాపం చూడనీ, యెల్లా బొబ్బలు కట్టిందో.... మందు రాయినా ?"

చేతితో నడుమును తాకి చూస్తున్నాడు. ఇదేమిటి మామయ్య యిట్లా చేస్తున్నాడు ? లేచి పక్కగా వెళ్ళింది.

"ఎందుకు అట్లా వెళ్ళిపోతావు ? నేనేగద ! యెంతో ప్రేమ నీమీద! యెన్నాళ్ళనించో నీ మీద మనసూ !"

చీకట్లో పట్టుకున్నాడు.

"ఇదేమిటి, మామయ్యా ? నా మీద నీకిట్లాంటి కోర్కె ! ఛీ, ఛీ వదిలెయ్యి.... అబ్బా ! అరుస్తాను. వూ..... వూపిరాట్టంలేదు. వదులు" గట్టిగా పోట్లాడి వదిలించుకుంది.

"ఆ డాక్టరు వెధవ విలవచెయ్యకపోతానా ? చిన్నప్పణ్నించి నీ జాగ్రత్త తీసుకుంటే యిదా కృతజ్ఞత ! వెధవ బెట్టు. అబ్బో నీ నీతీ ! నీ పాతివ్రత్యం నేనెరగనిదా!"

"పోనేలే నేను పాపిష్టిదాన్నే, నా సంగతి నీ కెందుకు పో"

"పోతా, పోతా, నోరుమూసుకుని యిట్లారా"

"వద్దు"

నా బాబువి కదూ ? నీ కింకేమీ భయం వద్దు, నేను కాపాడతాగా? నిన్నెవరూ ఏమీ అనరు. నే నననీను, చంపేస్తాను. నీ యిష్టం-కావలిస్తే ఎవరికీ తెలియకుండా ఆ డాక్టరు దగ్గిరికి నేనే తీసుకుపోతా రా."

"ఛీ, ఛీ, అమ్మతో చెపుతానుండు. ఏమిటీ పాడుబుద్ధీ నీకు ? ఇన్నేళ్ళొచ్చి-"

"ఓసి తప్పుడుముండా, నీతులు బోధిస్తున్నావుటే - నీ మొహం నిన్నడిగేదేమిటి ? విను, ఇదివరకంటే నేనడగడమూ తప్పే, నువ్వు ఒప్పుకోడమూ తప్పే ! కాని యిప్పుడేం అభ్యంతరం ? ఎట్లానూ చెడ్డావు. నేనోటీ వాడోటీనా! అందులో మామయ్యని - చిన్నప్పణ్నించి నిన్ను ప్రేమించినవాణ్ని, నీ అత్త ఓ బండ, మనిద్దరమూచేరి దాన్ని యేడిపిద్దాం - ఏం? మాట్లాడు. ఇలాంటి యిష్టం నీకు వుందనీ నాకు తెలీదు. తెలిస్తే వాడిదాకా పోనిచ్చేవాణ్నా నిన్ను ! నాతో ఒక్కమాట అనకూడదూ? ఆ రాత్రి జ్ఞాపకం లేదూ? చూశాను యిష్టపడతావేమోనని ! 'ఛా పాపం ! ఏ మెరగని పిల్ల! దానిజోలి నా కెందుకని' వూరుకున్నా ఏం? ఏమంటావు."

"ఉండు మామయ్యా, నాకిష్టంలేదు"

"ఇష్టం మహబాగా వుంటుంది, నా దగ్గిర చెప్పకు కబుర్లు"

"ఒదులు, ఒదలకపోతే అరుస్తాను"

"అరుస్తావా. అరుస్తావా. నీ గొంతు పిసుకుతాను. నీ నాలిక చీలుస్తా వాణ్ని రివాల్వరు పెట్టి కాలుస్తాను. ఎవరుకున్నాడు! మర్యాదస్తుల పిల్ల అనుకున్నాడా! బోగంది అనుకున్నాడా! ఎవడంట వాడు నీకు! నీలుగుతావూ పైగా పాడుపనిచేసి! నోరుమూసుకు పడివుండు".

గొంతు నొక్కాడు ఒక చేత్తో - ప్రాణం ఎగిరిపోతోంది. తన్నుకుంది, దొర్లింది, చెయ్యి కొంచెం ఒదులు కాగానే బిగ్గరగా అరిచింది. ఇద్దరు ముగ్గురు పరిగెత్తు కొచ్చారు.

"ఏమిటి! ఏమిటి! ఎవరు. దొంగలు-దీపం దీపం".

మామయ్య బట్టలు సర్దుకంటో లేస్తున్నాడు.

"ఏంలేదు. ఏంలేదు నీ దుంపతెగా; నా చేతుల్లో నీకు హత్య జరిగిందేవే; ఎవరూ లేరు. ఇదీ ఇదీ - నీ జింహ తీస్తా - చూసుకో నా తడాకా ఇది ఏదో కలవరిస్తోంది-కాదు పారిపోవాలని చూస్తోంది."

"ఎవరు ! ఎవరు !"

"ఇదే - కిటికీలోంచి దూకి పోవాలనుకుంది, ఏమిటా అని దీపం తెచ్చి చూస్తే -"

"అట్లాకాదు దీన్ని కట్టివెయ్యాలర్రా ! కాళ్ళు చేతులూ విరక్కొట్టి, అసలు దీని మదమణచాలి. వడ్లమన్నాటి వారి అమ్మాయికి చేసినట్టు-వాతలు పెడితే కాని బుద్ధిరాదు, ఇట్లాంటి వాళ్ళకి. ఓ తాడు తేవే !"

"ఏమిటి ఈ అర్ధరాత్రి ? దాని మొహం పారిపోవడ మేమిటి ?"

పోయి పడుకున్నారు.

నిజమే, మామయ్య మంచిమాట అన్నాడు..... పారిపోతే !

డాక్టరెక్కడ వుంటాడో, ఏం చేస్తోవుంటాడో ? ఎంత ఆశ్చర్యం కలుగుతుంది అతనికి ! కాని తనని యింట్లోనే వుంచుకుంటాడా? మరివీళ్ళు వచ్చి తగాదా పెడితే? పోనీ యింకో వూరు పోవచ్చు. బదలాయింపు తెప్పించుకుంటానని కూడా అన్నాడు ఒకసారి. మరి వెంటనే వెళ్ళిపోవడానికి వీలుంటుందా? ఆ సంగతులన్నీ అతనే చూసుకుంటాడు. తనకెందుకు ముందే ఈ సందేహాలు-అతని దగ్గిరకి వెళ్ళిపోయి, తరువాత యింకేం కావాలి తనకి ? వీళ్ళు బాగా ఏడుస్తారు. కాని పాపం అమ్మ ఏడిస్తే తనకి దిగులు పుడుతుంది. కాని ఏం చెయ్యగలదు. తను ?

ఇప్పుడెన్ని గంటలో మరి ? ఇప్పుడుకాదు. వెడితే ! ఆ రోడ్ల వెంబడి వకత్తా! భయంకాదా? రేపు వెళ్ళాలి కాని పగలు అందరూ చూడరా ఆస్పత్రికి వెడితే ఎట్లా ? కాదు ! రేపు సాయంత్రం చీకటిపడ్డాక పోవాలి.

ఏ యిల్లూ లేదు

అమ్మా ! ఇంట్లోంచి తప్పించుకోవడం, అంత కష్టంగా లేదు గాని ఆ రోడ్ల వెంబడి చీకట్లో నడిచి ఎవరికంటా పడకుండా రావడం మాత్రం చాలా ప్రయాస అయింది. ప్రతివారూ విరోధుల్లాగే తోచారు. ఎంతో దూరమనిపించింది. కాని కష్టాలు గట్టెక్కాయి. డాక్టరు లోపల యెవరి తోనో మాట్లాడుతున్నాడు. కొంచెం సేపు వరండాలో చీకట్లోనుంచుంది. ఆ కొత్తాయన వుండగా ఎట్లా లోపలికి వెళ్ళడం, ఆలస్యమవుతోంది. తన వాళ్ళు తరుముకువస్తే! ఈపాటికి వెతుక్కుంటూ వుండాలి.

నౌకరు వచ్చి, ఆమెని చూసి, అడిగాడు, అనుసూయమ్మ వచ్చింది. చాలా జరూరు పనిట అని చెప్పమంది. ఈశ్వరుడి కరుణ అంటే అట్లా వుండాలి. అతను భుజంమీద చెయ్యివేసి లోపలికి తీసి కెళ్ళిం తరవాత ఏం చెయ్యగలరు తన వాళ్ళు, పమిటా జుట్టు సర్దుకుంది. జవాను చెప్పడం వినపడింది. మాటాల్లేవె. రాలేదేం. అవసరమైన పని కావును. కాని ఈ బైట కూచోడమెట్లా. తెగించింది. తలుపు తోసుకుని లోపలికి నడిచింది. ఆమెని చూడడంతో ప్రకాశరావు మొహం తెల్లనయింది. ఆమె మాట్లాడకముందే, అతను కోపంతో "మాట్లాడుతున్నాను, కనపడటంలేదూ బైట కూచోండి, వస్తాను" అని. ఇంగ్లీషులో తన సంగతే ఆ రెండో ఆయనతో చెప్తుతున్నాడు. ఏదో అబద్ధమై వుంటుంది. తను లోపలికి రావడం తప్పు గావును, తనకేం తెలుసు !

ఏమీ అనలేక బయటికి వెళ్ళింది. బయట రెండు బల్లలున్నాయి. వాటి మీద కూచుంది. రోడ్డు మీది వాళ్ళందరికీ కనపడుతోంది. అందరూ తననే చూస్తున్నారు. తనెంత రహస్యంగా రావాలనుకుందో, అంత బట్టబైలయింది. రాగానే ప్రకాశరావు తనని కావలించుకుంటాడనే గంపెడాశతో, విడుదలకాగానే పరిగెత్తుకొచ్చింది. ఇట్లా చేశాడు. యింత దుర్మార్గుడా ? కాదు, దుర్మార్గుడు కాదేమో ? ఆ కొత్త మనిషి యెవరో వుండబట్టి అట్లా చేశాడు. అంతేగాని తననంత దయగా ప్రేమగా లాలించే ప్రకాశరావు మారి పోతాడా ! ఇంకా ఆ కొత్త ఆయన యెప్పుడు వెడతాడు ! గంటయింది. అప్పుడప్పుడు వాళ్ళు మాట్లాడే వ్యవహారం మాటలు ఆమెచెవుల్లో పడుతున్నాయి.

ఆయనెవరో వెళ్ళగానే తనను యెంతగా ఆదరంగా చూస్తాడో ! తను అతని యింట్లోనే యెంత సుఖంగా వుండవచ్చు. ఆలోచించుకుంటోంది కిటికీలోంచి ఆ కొత్తాయన బూడ్సులు కనబడుతున్నాయి. అవి యెంతసేపటికీ కదలవు. అప్పుడప్పుడు మాట్లాడకుండా కూచుంటాడు. వెళ్ళడు. మాట్లాడినప్పుడు ముగించే విధంగా మాటలు వినపడవు. తనని కలుసుకోవాలనే ఆతృతతో ప్రకాశరావు "సరేలెండి, తక్కింది రేపు మాట్లాడుదాము" అని ఆయన్ని పంపేస్తాడనుకుంది. కాని ప్రకాశరావే కావలిసి ఆయన్ని కబుర్లలోకి దింపి ఆపుతున్నట్టు కూడా తోచింది !

చివరికి ఛైర్మనుగారు లేచారు. ఆయన్ని పంపేందుకు ప్రకాశరావు వరండాలోకి వచ్చాడు. ఆయన వెళ్ళగానే డాక్టరు అనుసూయ వైపు తిరిగి,

"ఇదేమిటి యిప్పుడొచ్చావిట్లా !" అన్నాడు. కంఠంలో కోపం వినపడుతోంది.

"లోపలికి రా" అని ఆమెను తన మందుల గదిలోకి తీసి కెళ్ళాడు. వెంటనే ఆమె తన చేతుల్ని అతని మెడచుట్టూ వేసి మొహంకేసి చూసింది. ఆమె మొహాన్ని దగ్గిరగా వంచి ముద్దు పెట్టుకున్నాడు. ఆమె అతని మెడ వదలక పెదవుల్ని దగ్గిరిగా తీసుకోడం చూసి అతనికి భయం కలిగింది. మెల్లిగా వదిలించుకుని,

"ఏమిటి తొందరగా చెప్పు" అన్నాడు.

"కనుక్కున్న తరువాత వూరుకుంటారనుకున్నానూ, నన్ను గదిలో వేసి చాలా యేడిపించారు. నిన్న రాత్రి మా మామ.... పరిగెత్తుకొచ్చాడు, యింకా నేను యింటికి వెళ్ళను."

"వెళ్ళక !" అతని కంఠ స్వరంలోని అనుమానం విని అనుసూయకి భయం కలిగింది.

"ఇక్కడే వుంటాను. ఎక్కడైనా వుంటాను."

"ఇంటి దగ్గిర్నించి రావడం మంచి పనేనా!" నుదురు ముడతలు పడ్డది. కళ్ళలో కోపం కపడుతోంది.

"ఎట్లా వుండను ఆ ఇంటో ! నన్నేం చేశారంటే...."

ఎట్టాగో మారిపోయినాడు యీ మూడు రోజుల్లో. అంతా అతనితో చెప్పేద్దా మనుకుంది. చెప్పడానికి అనుకున్నా మాటలేవీ రావడంలేదు.

"చూడండి మూడు రాత్రులు కనపడకపోతే యేమను కున్నారు వూరంతా గోలయింది, మీకు తెలీలా !"

తెలిసిందని తలవూయించాడు.

"మీరేం చెయ్యలేదేం !"

"ఏం చెయ్యను !"

"నాకేం తెలుస్తుంది. మీకు తెలియాలి ! యేమేమిటో అనుకున్నాను వాళ్ళని కైదు చేయిస్తారనీ. నన్ను తీసుకు వెడతారనీ యేమేమిటో అనుకున్నాను.. పోనీలెండి. అదంతా అయిపోయింది. తప్పించుకువచ్చేశాను. యీ మూడు రోజులూ మిమ్మల్ని చూడాలనే, యెప్పుడు చూస్తానా అనే ! మళ్ళీ యీవాళ రాత్రి... మళ్ళీ ఇంక వదిలిపెట్టను కదా..... యింక యెప్పుడూ....

అతన్ని చాలా ప్రేమతో తాకింది. యీ ప్రేమని చూసి అతని మొహంలో కలిగే మార్పు అనుసూయ గుండెల్లో భీతి పుట్టించింది. అతను మాట్లాడితే వినాలని ఆగింది.

"అసలు ఇంటిదగ్గిర్నించి రావడం చాలా తప్పు. ఇప్పుడేమైపోతావు! నాకు కబురు పంపించి వుండవలసింది."

"మీ దగ్గిర వుంటాను."

"నా దగ్గిరా !"

"అవును."

"ఇక్కడెట్లా వీలవుతుంది, నువ్వు నా కెవరని ఇక్కడ వుంచను !"

అనుసూయకి తెలిసింది.

"పుణ్యోండి. నేను వెళ్ళను. యెక్కడికి వెళ్లను ?"

"ఇంటికి వెళ్ళాలి. మళ్ళీ వాళ్ళనుమాన పడకముందే వెళ్ళాలి, నీ శ్రేయస్సుకోరే చెపుతున్నాను. వచ్చే కష్టాలు నీ కర్థంకావు. చిన్నదానివి."

"నన్ను మళ్ళీ మీ దగ్గిరికి రానీరు".

"పోనీ !"

ప్రకాశరావు తననించి ఇట్లా విముఖుడు కావడం అనుసూయకి ఏమాత్రం అర్థంకాలేదు. మర్యాదస్థులైన మొగవాళ్ళని పాలించే మాలిన్యాలూ, స్వార్థాలూ ఆమె కింకా తెలీవు. తనేదో తప్పుచేశాననీ, తల్లినీ, యింటినీ వదలడం అతను ఎందుకో అంగీకరించడంలేదనీ, ఆమె మనసు వెనక ఆలోచించుకుంటోంది, తనని ప్రోత్సహించిన ఆనందానికీ, రొమాన్సుకి తన సర్వస్వాన్ని అప్పగించి, వెనుక ముందులు చూడకుండా ముందుకి దూకిన అనుసూయకి పాపం యీ అనుభవం భయంకరమైన కలమల్లే వుంది.

"ఎట్లా !" అంది, ఏం తోచక.

"ఎంతకాలం వచ్చేదానివి ! నాకు 'ట్రాన్సురు' అయితే యేం చేసేదానివి?"

"మిమ్మల్ని చూడకుండానా ! నేనుండలేను. మిమ్మల్ని ప్రేమించాను. చూడకండా బతకలేను. నేను వెళ్ళను".

"ఇట్లాకాదు, నేనూ నిన్ను ప్రేమించాను. కాని నాలుగు రాత్రులు గడిపితే- యెల్లకాలమూ వీలవుతుందా? ఆలోచించుకో, నీ బంధువులూ, సంసారమూ అన్నీ వదిలి యిట్లా వచ్చేసి యేమైపోదామని ! నా మాటవిని వెంటనే వెళ్లు."

"నన్ను ప్రేమించిన విధం - ఆస్పత్రిలో మీరు, నేను-మీ దాన్ని, నన్నే ప్రేమిస్తున్నానని, ఆ మాటలని....."

"ఆ సమయం అన్నవన్నీ నిజంగా వేదవాక్యాలుగా పట్టుకుంటావా - నువ్వింకా చిన్నదానివి నా మాట విను."

"అయితే నేను మీ కక్కర్లేదూ ?"

"కావాలి. కాని యిట్లా యింటిదగ్గిర్నించి వచ్చి నాతో వుంటే నన్ను పాడుచేస్తావు. నువ్వు పాడవుతావు. అందుకని చెపుతున్నాను."

"మిమ్మల్ని చూడడానికి వీలుండదుగా ?"

"అదే మంచింది."

"అంతేనా ? మిమ్మల్నెంత నమ్మానండి! యెంత ప్రేమించానండి"

లోపల్నించి డాక్టర్ని యెవరో పిలుస్తున్నారు.

"నేనేమైపోవాలి? యేమైనాసరే యింటికి వెళ్ళను, యేంకాను?"

"మీ యింటిదగ్గిర దిగపెడతాను రా."

ఎవరో తలుపు కొడుతున్నారు.

"వస్తున్నాను, యింట్లోకి వెళ్ళు" అన్నాడు డాక్టరు బైటవారితో.

యింక లాభం లేదనుకుంది. డాక్టరు చెయ్యిపట్టుకుని బైటికి తీసికెడుతో వుంటే, మాట్లాడకండా యేడుస్తోవచ్చింది. వరండాలో ఒకసారి మళ్ళా డాక్టరు మొహంకేసి చూసింది. రాత్రికేసి చూసింది. వీధికేసి చూసింది. వీధిలో యెవరూ తిరగటంలేదు. "ఇంతేనండీ" అని మూలుగుతో యేడ్చి వీధిలో కెళ్ళి "ఇంక నన్ను చూడరు. సుఖంగా బతకండి" అని వెళ్ళిపోయిండ.

అనుసూయ వెళ్ళగానే డాక్టరు విచారంతో స్తంభం పట్టుకుని నుంచున్నాడు ఒక నిముషం.

"ఆమె యెవరండీ. యీ అర్ధరాత్రి అట్లా పంపించేశారు" అన్నాడు చీకట్లో మూలనున్న ఆయన బల్లమీదనించి. ప్రకాశరావు అదిరిపడి ఎవరు వారన్నాడు.

"నేనండీ, సూరయ్యని."

ప్రకాశరావు సూరయ్యని రాత్రి పడుకోడానికి రమ్మన్న సంగతి మరచిపోయినాడు. ఆయన పక్కన పల్లెటూరినించి మందు పుచ్చుకోడానికి వచ్చిన కమ్మాయన. భాగ్యవంతుడు. కనక ప్రకాశరావు ఆయనకి చాలా మర్యాద చేస్తున్నాడు. అతను తనని ఆ సమయంలో చూసినందుకు అనుసూయమీద కోపమొచ్చింది.

"నా దగ్గిర మందుకొచ్చేదిలెండి. మంచి రకంకాదు. యింట్లో తగాదాపడి యిక్కడికి వచ్చి నన్ను యెక్కడన్నా వుండడానికి స్తలం చూపమంటుంది. నేనేం చెయ్యను! వెళ్ళమంటే యేడుస్తుంది."

"పాపం ఇప్పుడేమవుతుందో".

"ఇంటికి పోతుంది. మనకెందుకులెండి, బైటకూచున్నారేం, చీకట్లో పక్కేమన్నా ఇస్తానుండండి" అని లోపలికి వెళ్ళిపోయినాడు.

సూరయ్యకి అరవైయేళ్ళు దగ్గిరిగా వచ్చినా 'రొమాన్సు' చావలేదు, జాలి యెండిపోలేదు. అనుసూయ వంక చీకట్లో చూసినప్పుడే ఆమె లేత ధృఢమైన నడుంవంపు, చంపల కోలతనమూ కనపడ్డది. అనేక స్త్రీ సౌందర్యాలని చూసిన అతని కళ్ళకి, వాటి అనుభవమిచ్చే సౌఖ్యమూ ఆమె కంఠంలో వుండే 'పాషన్' తెలిసింది. వెంటనే లేచి చీకట్లో ఆమెని వెతుక్కుంటూ బైలుదేరాడు. ఇట్లాంటి నిశీధ అన్వేషణాలవల్లనే తనకి యీ ఆస్పత్రికి చేరే గతిపట్టిన సంగతి మరిచాడు.

దిగులుతో మెల్లిగా నడిచే అనుసూయ వెంటే దూరంగా నడుస్తున్నాడు. ఆమె ఇళ్ళ నీడలలో నడుస్తో వూరిబైట కాలవ దగ్గిరికి పోయింది. నీటిదగ్గిరిగా నుంచుని కొంచెం సేపు యేదో ఆలోచించి, చుట్టూ చూసింది. కూచుంది ఏమాలోచిస్తోందో మెల్లిగా యేడుపు ప్రారంభించింది. కాలవ అవతల వొడ్డున గానుగచెట్లలో మిణుగురు పురుగులు ఆడుతున్నాయి. నీటిలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. ఆమెయెక్కిళ్ళుతప్ప ఇంకేమి శబ్దంలేదు. సూరయ్య హృదయం తపించింది. ఆ ఏడుపులోని అమాయకత్వం, నిరాశా బోధపడుతున్నాయి. యవ్వనానందంతో నిలవలేక అనాలోచనగా, కనపడ్డ పురుషుణ్ని నమ్మి నశించిన కన్యల హృదయ వేదనంతా వినవచ్చింది, అతనికి ఆ రాత్రి. అనుభవించిన పురుషుడు చెక్కు చెదరక వృద్ధి పొందడమూ, వాడు నలిపి వాసనచూసి పారేసిన యీ చిన్న పూలిట్లా వాడిపోవడమూ, సంఘం నిరాదరణా, నిర్దయా, మృత్యువు తప్ప ఇంకో ఆహ్వానం లేకపోవడమూ, అన్ని దూరంగా తోచాయి అతని మనస్సుకి. "బిత్రే" అయిన స్త్రీ కన్న ఘోరమింకోటి ప్రపంచంలో లేదు.

వెనకనే వెళ్ళి "తల్లీ" అన్నాడు.

ఆమె గబాలున నీళ్ళలో పడ్డది.

సూరయ్య ప్రాణాలు ఎగిరిపోయినాయి. అతనికి ఈతరాదు. కాని ఆలోచించలేదు, దూకాడు, ఎండాకాలం కావడంచేత కాలవ లోతులేదు. అతనికి కంఠంవరకు నీళ్ళొచ్చాయి. చుట్టూ చూశాడు. జాడలేదు..... నీళ్ళ అలలూ, అలలమీద చెదిరే నక్షత్ర రేఖలుతప్ప. సగం మునిగి యిటూ అటూ వెతికాడు. కనపళ్ళేదు, ఎంతసేపయిందో! విచారంతో భయంతో చూట్టూ చూస్తున్నాడు. మెల్లిగా పీచులాగా వెంట్రికలు కనపడ్డాయి. తాకడం భయంవేసింది. బతికివున్న తలమీది వెంట్రికలు ముద్దు పెట్టుకుంటాము, వేళ్ళతో ఆడుకుంటాము, కాని మరణించగానే నీళ్ళలో చీకట్లో తేలివచ్చే వెంట్రుకల్ని చూస్తే భయం అనుకున్నాడు. చప్పున

పట్టుకుని పైకిలాగా మనిషిని వడ్డుకు తెచ్చాడు. ప్రాణం కనపళ్ళేదు. సంఘం బలి తీసుకున్న ఆ బాలిక వంక చూస్తో నుంచున్నాడు సూరయ్య. ఆకాశాన నక్షత్రాలు మెరుస్తున్నాయి. మిణుగురు పురుగులు గానుగచెట్లతో ఆడుకుంటున్నాయి. నీళ్ళు మళ్ళీ కుదుటపడ్డాయి. లోకం మామూలుగా నిద్ర పోతోంది. అనుసూయ కదలకుండా పడివుంది. యీ కామాలకి, ఈ క్షోభలకి! పెంపుళ్ళకి, మామయ్యకీ! నిందలకీ, నవ్వులకీ, ఈర్ష్యలకీ అతీతురాలై.

◆ ◆ ◆